
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY ఖమ్మం KHAMMAM
గురువారం, 23 మే 2024




నల్లగొండ, ఖమ్మం, వరంగల్ జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉపఎన్నికల పోరు పతాకస్థాయికి చేరింది. అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికలను మరిపించేలా అభ్యర్థులు ప్రచారం సాగిస్తున్నారు. 27న ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ జరగనున్న నేపథ్యంలో ప్రచారపర్వం 25 సాయంత్రంతో ముగియనుంది. ప్రచారానికి ఇంకా మూడు రోజులే సమయం ఉండడంతో ప్రధాన పార్టీలు అభ్యర్థులు ప్రచారాన్ని పతాకస్థాయికి తీసుకెళుతున్నారు. పార్టీ ముఖ్యనేతలంతా ప్రచారంలో పాల్గొంటూ ఎన్నికను సవాల్‌గా తీసుకుంటున్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా పట్టబద్రుల ఎన్నికను మూడు ప్రధాన పార్టీలు ప్రతిష్టాత్మకంగా తీసుకున్నాయి. మొత్తం 52మంది అభ్యర్థులు ఈ ఎన్నికల బరిలో ఉన్నారు. ప్రధానంగా కాంగ్రెస్ నుంచి తీన్మార్ మల్లన్న, బీజేపీ నుంచి గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి, బీఆర్ఎస్ నుంచి ఏనుగుల రాకేష్‌రెడ్డి పోటాపోటీగా ప్రచారం నిర్వహిస్తున్నారు.

పతాకస్థాయికి ఎమ్మెల్సీ పోరు



- ముఖ్యనేతల రాకతో మరింత వేడెక్కిన ప్రచారం
- 25న ముగియనున్న ప్రచార పర్వం
- పోలింగ్ ఏర్పాట్లలో అధికార యంత్రాంగం

ఖమ్మం, మే 22 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): కాంగ్రెస్ అభ్యర్థి తీన్మార్ మల్లన్న జిల్లాలో రెండు రోజుల పాటు ప్రచారం నిర్వహించారు. పట్టభద్రులను, ఉద్యోగులను, నిరుద్యోగులను కలిసి ఓటు అడిగారు. మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి కూడా మల్లన్న తరుపున ప్రచారంలో పాల్గొన్నారు. ఎమ్మెల్యేలు, జిల్లా పార్టీ నాయకులందరు మండల, గ్రామస్థాయి నాయకులు ఓటర్లను కలిసి తీన్మార్ మల్లన్నకు మొదటి ప్రాధాన్యత ఓటువేయాలని ప్రచారం చేస్తున్నారు. మండల కేంద్రాల్లో ర్యాలీలుతో ప్రచారం నిర్వహిస్తున్నారు. కాంగ్రెస్ పార్టీ ఈసారి పట్టభద్రుల ఎన్నికను ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. బీజేపీ అభ్యర్థి గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి కూడా జిల్లాలో మొదటి విడతగా ప్రచారం చేసి వెళ్లారు. ఆయనకు మద్దతుగా మాజీ మంత్రి ఈటల రాజేందర్, మాజీ ఎమ్మెల్యే ధర్మారావుతో పాటు ఖమ్మం బీజేపీ అభ్యర్థి తాండ్ర వినోదరావు, బీజేపీ జిల్లా అధ్యక్షుడు గల్లా సత్యనారాయణ, రాష్ట్ర నాయకులు శ్రీధర్‌రెడ్డి తదితరులు ప్రచారంలో పాలుపంచుకుంటున్నారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి కూడా గురువారం ఖమ్మం రాబోతున్నారు.

బీఆర్ఎస్ అభ్యర్థి ఏనుగుల రాకేష్‌రెడ్డి గెలుపుకోసం మాజీమంత్రి కేటీఆర్ ఇల్లెందు, కొత్తగూడెం, ఖమ్మంలో ప్రచార సభలు నిర్వహించారు. ఎంపీలు వద్దిరాజు రవిచంద్ర, నామా నాగేశ్వరరావు, మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్, బీఆర్ఎస్ ఖమ్మం జిల్లా అధ్యక్షుడు తాతా మధుసూదన్, ఖమ్మం ఇన్‌చార్జ్ గుండాల కృష్ణతో పాటు స్థానిక సంస్థల ప్రతినిధులు, మాజీ ఎమ్మెల్యేలు బీఆర్ఎస్ గెలుపుకోసం పట్టుదలతో పనిచేస్తున్నారు. అసెంబ్లీ ఎన్నికల పరాజయాన్ని ఎమ్మెల్సీ గెలుపుతో కొంత పూడ్చుకునేందుకు బీఆర్ఎస్ ప్రయత్నిస్తోంది. గతంలో సిటింగ్ సీటుగా ఉన్న ఈ పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానం బీఆర్ఎస్‌కు గుండె కాయలాంటిది. అందుకే ఈ ఎన్నికల్లో పట్టు చూపించి క్షేత్రస్థాయిలో బలం నిరూపించుకోవాలని చూస్తోంది. మొత్తం మీదుగా మూడు ప్రధాన పార్టీలు ప్రచారంలో నువ్వా నేనా అన్నట్టు ప్రచారం సాగిస్తున్నాయి.

ముమ్మరంగా పోలింగ్ ఏర్పాట్లు..

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ఓట్లు అధికంగానే ఉన్నాయి. దీంతో ఈనెల 27న ఎన్నికలు పకడ్బందీగా నిర్వహించేందుకు రెండు జిల్లాల అధికార యంత్రాంగం దృష్టి సారించింది. ఖమ్మం జిల్లా పరిధిలో 83,879 ఓట్లు ఉండగా పురుషులు 50,676, మహిళలు 33199, ఇతరులు నలుగురు ఉన్నారు. మొత్తం 118 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయగా ఖమ్మం పట్టణంలోనే 57వరకు పోలింగ్ కేంద్రాలున్నాయి. ఉదయం 8గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు పోలింగ్ జరగనుంది. జూన్ 5న నల్లగొండలో కౌంటింగ్ జరగనుంది. ఖమ్మం ఎస్ఆర్‌అండ్‌బీజీఎన్ఆర్ కళాశాలలో 26బ్యాలెట్ బాక్సుల పంపిణీ చేయనున్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో మొత్తం 40,106 మంది ఓటర్లు ఉండగా పురుషులు 22,590, మహిళలు 17516 మంది ఉన్నారు. మొత్తం 55 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. 69 బ్యాలెట్ బాక్సులు సిద్ధం చేశారు. కొత్తగూడెంలోని శ్రీరామచంద్ర ఆర్ట్స్ కాలేజీలో 26న బ్యాలెట్ బాక్సుల పంపిణీ జరగనుంది. 27న పోలింగ్ అనంతరం ఇరు జిల్లాల్లోని బ్యాలెట్ బాక్సులను నల్లగొండలోని స్ట్రాంగ్ రూంకు తరలించనున్నారు.

లోక్‌సభ ఓట్ల లెక్కింపునకు పకడ్బందీ ఏర్పాట్లు


మాట్లాడుతున్న కలెక్టర్ వీపీ గౌతమ్

- అభ్యర్థులు ఎప్పుడైనా స్ట్రాంగ్ రూంలను పరిశీలించుకోవచ్చు
- ఎమ్మెల్సీ ఎన్నికలకూ ఏర్పాట్లు పూర్తి
- రాజకీయపార్టీల ప్రతినిధులతో కలెక్టర్ సమీక్ష

ఖమ్మం కలెక్టరేట్, మే 22: లోక్‌సభ ఎన్నికల ఓట్ల లెక్కింపునకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు రిటర్నింగ్ అధికారి, ఖమ్మం కలెక్టర్ వీపీ గౌతమ్ తెలిపారు. లోక్‌సభ ఓట్ల లెక్కింపును ఖమ్మం రూరల్ మండలం పొన్నెకల్‌లోని శ్రీ చైతన్య ఇంజనీరింగ్ కళాశాలలో చేపట్టనున్నట్లు తెలిపారు. నియోజకవర్గ పరిధిలోని 7 అసెంబ్లీ సెగ్మెంట్లకు 7 చొప్పున, పోస్టల్ బ్యాలెట్ల లెక్కింపుకు ఒకటి, మొత్తం 8హాళ్లను ఏర్పాటుచేసినట్లు తెలిపారు. ఒక్కో హాల్లో 14 టేబుళ్ల చొప్పున ఏర్పాటు చేయగా, ఒక్క ఖమ్మం అసెంబ్లీ సెగ్మెంట్‌లో 355పోలింగ్ కేంద్రాలు ఉండడంతో అక్కడ 18టేబుళ్లు ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. పోటీచేసిన అభ్యర్థులు 117మంది ఏజెంట్లను నియమించుకోవాలన్నారు. ఏజెంట్ల వివరాలు ఫారం-18లో సమర్పించాలన్నారు. గురువారం సాయంత్రంలోగా వివరాలు అందించాలన్నారు. జూన్ 4న ఉదయం 8 గంటలకు కౌంటింగ్ ప్రారంభం అవుతుందని, ఉదయం 5గంటలకు ఈవీఎం స్ట్రాంగ్ రూంలను రాజకీయ పార్టీల ప్రతినిధులు, పోటీ అభ్యర్థుల సమక్షంలో తెరవనున్నట్లు తెలిపారు. పోటీచేసిన అభ్యర్థులు, చీఫ్ ఏజంట్లు నిర్ణీత సమయానికి కౌంటింగ్ కేంద్రానికి రావాలన్నారు. ఏజెంట్లు పాసుల కోసం 2 పాస్‌పోర్ట్ సైజ్ ఫోటోలు ఇవ్వాలన్నారు. కౌంటింగ్ కేంద్రంలోకి మొబైల్ ఫోన్ల అనుమతి లేదని తెలిపారు. ఈనెల 13న పోలింగ్ అనంతరం ఈవీఎంలను శ్రీ చైతన్య ఇంజనీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్‌కు తరలించి, మూడంచెల భద్రత ఏర్పాటు చేసినట్లు తెలిపారు. రాజకీయ పార్టీల ప్రతినిధులు, అభ్యర్థులు స్ట్రాంగ్ రూంలను సందర్శించవచ్చని కలెక్టర్ వివరించారు.

వరంగల్-ఖమ్మం-నల్లగొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నికలకూ ఏర్పాట్లు పూర్తి చేసినట్లు కలెక్టర్ వీపీ గౌతమ్ తెలిపారు. 27న ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ నిర్వహించనున్నట్లు తెలిపారు. జిల్లాలో 83,879 మంది పట్టభద్రులు ఓటర్లుగా నమోదయ్యారని,

(మిగతా 6వ పేజీలో...)

వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ సత్తాచాటాలి

- అందరూ కలిసి పార్టీ అభివృద్ధికి కృషి చేయాలి
- వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు


మంత్రి తుమ్మలను మర్యాదపూర్వకంగా కలిసిన నాయకులు

దమ్మపేట, మే 22: పాత, కొత్త నేతలంతా కలిసి కాంగ్రెస్ పార్టీ అభివృద్ధికి కృషి చేయాలని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కోరారు. ఇటీవల ముష్టిబండ గ్రామానికి చెందిన 50పైగా టీడీపీ కుటుంబాలు కాంగ్రెస్‌పార్టీలో చేరాయి. కూకులకుంట రమేష్, మాధవరావు, గంగాధరరావు ఆధ్వర్యంలో కొత్తగా చేరిన నాయకులు, కార్యకర్తలు బుధవారం గండుగులపల్లిలోని మంత్రి తుమ్మలను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా తుమ్మల మాట్లాడుతూ అందరూ కలిసి రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయానికి కృషి చేయాలని కోరారు. త్వరలో జరగనున్న పట్టభద్రుల ఎన్నికలు, ఆ త్వరలో జరిగే స్థానిక సంస్థల ఎన్నికల్లో పాత కొత్త నేతలంతా కలిసికట్టుగా పనిచేసి కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించేందుకు కృషి చేయాలన్నారు.తుమ్మలను కలిసినవారిలో నందమూరి సూర్యారావు, నందమూరి నాగు, నందా సుబ్బారావు, జోగారావు, మోరంపూడి ప్రసాద్, కిరణ్, ప్రభాకర్ ఉన్నారు. అనంతరం సత్తుపల్లికి చెందిన లారీ ట్రాన్స్‌పోర్ట్ యజమానులు తుమ్మలను కలిసి సింగరేణి సమస్యలను ఆయనకు వివరించారు. దమ్మపేట, అశ్వారావుపేట తదితర మండలాలకు చెందిన పలువురు తుమ్మలను కలిశారు. తుమ్మలను కలిసిన వారిలో పామాయిల్ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఆలపాటి రాంచంద్రప్రసాద్, కోయ్యల అచ్యుతరావు, కేవీ సత్యనారాయణ, దమ్మపేట సొసైటీ ఛైర్మన్ ఎల్లిన రాఘవరావు, కాసాని నాగప్రసాదు, దొడ్డా ప్రసాదు, ఎర్రా వసంతం, మన్నెం అప్పారావు తదితరులు ఉన్నారు.

నేడు ఖమ్మానికి కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

పట్టభద్రుల ఎమ్మెల్సీ బీజేపీ అభ్యర్థి తరుపున ఎన్నికల ప్రచారం



ఖమ్మం, మే 22 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డి గురువారం ఖమ్మం పర్యటనకు రాబోతున్నారు. నల్లగొండ, వరంగల్, ఖమ్మం పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి విజయాన్ని కోరుతూ ప్రచారం నిర్వహించన్నారు. మధ్యాహ్నం 3-30గంటలకు ఖమ్మం చేరుకుని శ్రీశ్రీ హోటల్‌లో విలేకరుల సమావేశంలో పాల్గొంటారు. సాయంత్రం 4-45 గంటల నుంచి 6గంటల వరకు అక్కడే పుర ప్రముఖులు, మేధావులతో సమావేశమవుతారు. అనంతరం సప్తపది ఫంక్షన్‌హాల్‌లో పట్టభద్రులతో సమావేశమవుతారని బీజేపీ ఖమ్మం జిల్లా అధ్యక్షుడు గల్లా సత్యనారాయణ తెలిపారు.

ప్రభుత్వాసుపత్రులకు విద్యుత్ సరఫరాపై నజర్



- ఎంజీఎం ఘటనతో ఉమ్మడి జిల్లాలో అప్రమత్తం
- ఇక విద్యుత్‌శాఖ పర్యవేక్షణలోకి ఆసుపత్రులు
- అధికారులకు టీజీఎన్పీడీసీఎల్ సీఎండీ ఆదేశాలు

ఖమ్మం సంక్షేమవిభాగం, మే 22: వరంగల్ ఎంజీఎం ఆసుపత్రిలో గంటల తరబడి కరెంట్ కట్‌తో రోగుల ఇబ్బందులు పడిన వ్యవహారం రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారడంతో విద్యుత్‌శాఖ అప్రమత్తమైంది. ఈ వ్యవహారంపై బుధవారం స్పందించిన టీజీఎస్పీడీసీఎల్ సీఎండీ వరుణ్‌రెడ్డి ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని విద్యుత్‌శాఖ జిల్లా పర్యవేక్షకులు, డివిజనల్, మండల, విద్యుత్ ఉపకేంద్రాల స్థాయిలోని ఇంజనీరింగ్ అధికారులను అప్రమత్తం చేశారు. ఉమ్మడి జిల్లాలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల నుంచి జిల్లాస్థాయిలోని ప్రభుత్వ ఆసుపత్రులు, వైద్య కళాశాలల వరకు విద్యుత్ పర్యవేక్షణ చేయాలని సర్క్యూలర్ జారీ చేశారు. ఖమ్మం జిల్లా ఆసుపత్రి, మాతాశిశు విభాగాలు, వైద్య కళాశాలలను జిల్లా స్థాయిలో ఎస్ఈలు పర్యవేక్షణ చేయాలని, కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లను డీఈ స్థాయి అధికారులు, మండల స్థాయిలోని పీహెచ్‌సీలను ఏడీఈ స్థాయి అధికారులు పర్యవేక్షణ చేయాలని ఆదేశించారు. విద్యుత్‌శాఖ ద్వారా నిరంతరాయంగా విద్యుత్ సరఫరా చేయటంతోపాటుగా ఆకస్మికంగా విద్యుత్ అంతరాయం కలిగితే ప్రభుత్వ ఆసుపత్రుల్లో జనరేటర్లు, ఇతర ప్రత్యామ్నాయ ఉపకరణాలను ఆయా ఆసుపత్రుల నిర్వాహణ కమిటీలతో మాట్లాడి ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఇప్పటి వరకు ఆసుపత్రుల్లో ఉన్న విద్యుత్ సరఫరా వ్యవస్థలో లోపాలు ఉంటే వాటిని వెంటనే సరిదిద్దాలని ఆదేశించారు. ప్రభుత్వ ఆసుపత్రుల భవనాల అంతర్గత విద్యుత్ సరఫరా, ప్రాంగణంలో చెట్లపై విద్యుత్ తీగలు అంతరాయం, శిథిలావస్థకు చేరిన విద్యుత్ పరికరాలను పరిశీలించి శనివారం సాయంత్రం వరకు నివేదికలను అందించాలని సీఎండీ వరుణ్‌రెడ్డి ఉమ్మడి జిల్లా విద్యుత్ పర్యవేక్షణ అధికారులను ఆదేశించారు. దీంతో బుధవారం సాయంత్రం నుంచి విద్యుత్‌శాఖ అధికారులు ప్రభుత్వ ఆసుపత్రుల్లో విద్యుత్ వ్యవస్థల పరిశీలన ప్రారంభించారు.

నకిలీ విత్తనాలపై టాస్క్‌ఫోర్స్

- 21 బృందాలతో నిరంతరం పర్యవేక్షణ
- కల్తీ విత్తనాలు విక్రయిస్తే క్రిమినల్ కేసులు
- తరచూ కేసులు నమోదైతే పీడీ యాక్ట్ నమోదు
- జిల్లా సరిహద్దుల్లో నిఘా వ్యవస్థ పటిష్టం
- ఖమ్మం పోలీస్ కమిషనర్ సునీల్‌దత్



ఖమ్మం, మే22(ఆంధ్రజ్యోతి): నకిలీ విత్తనాలపై టాస్క్‌ఫోర్స్ బృందాలను ఏర్పాటు చేసినట్టు ఖమ్మం పోలీస్ కమిషనర్ సునీల్‌దత్ తెలిపారు. నకిలీ, కల్తీ విత్తనాల విక్రయాలపై ఆయన బుధవారం ఓ ప్రకటన విడుదల చేశారు. నకిలీ, కల్తీ విత్తనాల రవాణా, విక్రయాలను అరికట్టేందుకు ఖమ్మం కమిషనరేట్ పరిధిలో వ్యవసాయ, విత్తన కార్పొరేషన్, పోలీసు బలగాలతో 21 జాయింట్ టాస్క్‌ఫోర్స్ బృందాలను ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. నగరంతో పాటు మండలాల్లో ఆయా టాస్క్‌ఫోర్స్ బృందాలు నిరంతరం పర్యవేక్షణ చేస్తుంటాయన్నారు. నకిలీ విత్తనాలు విక్రయిస్తే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని కమిషనర్ హెచ్చరించారు. లైసెన్స్ లేకుండా వ్యాపారం చేసినా, దుకాణాలు, ఏజెంట్లు, మధ్యవర్తుల ముసుగులో ఎవరైనా నకిలీ విత్తనాలు విక్రయించినా వారిపై తీవ్రమైన కేసులు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. గతంలో నకిలీ విత్తనాల విక్రయాల్లో కేసులు నమోదైన వారిపై నిఘా ఉంటుందన్నారు. తరచూ కేసులు నమోదైతే పీడీయాక్ట్ అమలు చేస్తామని హెచ్చరించారు. రైతులు ప్రధానంగా గుర్తింపు పొందిన విత్తన దుకాణాల్లోనే విత్తనాలను కొనుగోలు చేయాలని సూచించారు. ఏ ప్రాంతంలోనైనా కచ్చితమైన కంపెనీ పేరు, బిల్లులు లేకుండా విడిగా విత్తనాలు విక్రయిస్తే వెంటనే స్థానిక పోలీస్‌స్టేషన్‌కు, మండల వ్యవసాయశాఖ అధికారులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. విత్తన డీలర్లు రైతులకు నాణ్యమైన విత్తనాలు, ఎరువులు విక్రయించాలని సూచించారు. ఎవరైనా ప్రముఖ బ్రాండెడ్ కంపెనీల విత్తనాల పేరుతో నాసిరకం, నకిలీ విత్తనాలు అంటగట్టి రైతులను మోసం చేయాలని చూస్తే ఉపేక్షించేది లేదన్నారు.

టాస్క్‌ఫోర్స్ బృందాలు జిల్లా పరిధిలోని విత్తన, ఎరువుల దుకాణాలు, గోదాముల్లో తనిఖీలు నిర్వహిస్తాయని తెలిపారు. నకిలీ విత్తనాలు జిల్లాలోకి రాకుండా ఉండేలా ఇప్పటికే ఇతర రాష్ట్రాల సరిహద్దు ప్రాంతాల్లో నిఘా ఏర్పాటు చేయడంతో పాటు సమాచారం వ్యవస్థను పటిష్టం చేశామన్నారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి అక్రమ రవాణా జరిగే ప్రాంతాల్లో ఆకస్మిక తనిఖీలు చేయనున్నట్టు తెలిపారు. రైతులకు నాణ్యమైన విత్తనాలు అందేలా పటిష్టమైన చర్యలు తీసుకుంటామన్నారు. రైతులు విత్తనాల కొనుగోలు సమయంలో జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కొనుగోలు చేసిన విత్తనాలకు సంబంధించి దుకాణాదారు నుంచి రశీదు తీసుకోవాలని సీపీ సూచించారు.



మల్లన్న గెలుస్తుండని కేటీఆర్‌కు భయం..

- కాంగ్రెస్ సన్నాహక సమావేశంలో తీన్మార్ మల్లన్న 6
- మద్దతు పలికిన మున్నూరుకాపు సంఘం

పట్టభద్రుల ఉప ఎన్నికలు

పకడ్బందీగా నిర్వహించాలి

- వీడియోకాన్ఫరెన్స్‌లో ప్రధాన ఎన్నికల అధికారి వికాస్‌రాజ్ 6


రఘునాథపాలెంలో అసంపూర్తిగా ఉన్న అదనపు గది, వంటశాల గది

6

నత్తనడకన 'మనబడి' పనులు

- ఇంకా అసంపూర్తిగానే తొలి విడత పనులు
- గతేడాది మేలోనే గడువు పూర్తి
- అయినా ఇంకా కొనసాగుతున్న నిర్మాణాలు

కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో సదుపాయాలను కల్పించి వాటిని తీర్చిదిద్దేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న మన ఊరు-మన బడి కార్యక్రమం తొలి విడత పనులు ఇంకా పూర్తికాలేదు. 2023 మే చివరికి పనులు పూర్తి కావాల్సి ఉండగా ఇంకా కొనసాగుతూనే ఉన్నాయి. మొదటి దఫాలో ఎంపికైన పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య అధికంగా ఉన్న బడుల్లో పనులు ప్రారంభం, నిధుల మంజూరు వంటి విషయాల్లో జాప్యం జరిగింది. నిధులు మంజూరైన కొన్ని పాఠశాలలో పనులు ప్రారంభమైనా మిగిలిన పాఠశాలల్లో ఆలస్యం జరుగుతోంది. మరోవైపు పాఠశాలలు ప్రారంభమైనా పనులు మాత్రం పెండింగ్‌లోనే ఉన్నాయి. అధికారులు 12రకాల అవసరాలను గుర్తించి పాఠశాలల్లో మరమ్మతులు చేపడుతున్నారు. అదనపు గదులు, మరుగుదొడ్లు, వాటర్ ట్యాంక్‌లు, ప్రహరీలు నిర్మిస్తున్నారు.

- ఖమ్మం ఖానాపురం హవేలీ

కారులో చిక్కుకుని మూడేళ్ల చిన్నారి మృతి



- ఆడుకుంటూ కారులోకి వెళ్లిన కల్నిషా
- డోర్‌లాక్ అవ్వడంతో ఊపిరాడక మృతి
- మణుగూరు మండలం సాంబాయిగూడెంలో విషాదం

మణుగూరు, మే 22:సరదాగా ఆడుకుంటూ వెళ్లిన ఆ చిన్నారిని కారు రూపంలో మృత్యువు కబళించింది. కార్‌డోర్ లాక్ అవ్వడంతో ఊపిరాడక మూడేళ్ల చిన్నారి మృతిచెందింది. భద్రాద్రి జిల్లా మణుగూరు మండలం సాంబాయిగూడెంలో మంగళవారం సాయంత్రం జరిగిన ఈఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. సాంబాయిగూడెం గ్రామానికి చెందిన మడకం సాయి, లిఖిత దంపతుల తొలి సంతానం కల్నిషా(3) కారులో చిక్కుకొని ఊపిరాడక మృతి చెందింది. మంగళవారం సాయంత్రం మూడు గంటల సమయంలో ఆడుకుంటూ ఇంటినుంచి వెళ్లింది. అయితే వారి ఇంటి పరిసరాల్లోని వారంతా తమ బంధువులే కావడంతో పాప ఎవరో ఒకరి ఇంటికి వెళ్లి ఉంటుందని పాప తల్లిదండ్రులు భావించారు. సాయంత్రం అయినా.. పాప ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు చుట్టుపక్కల వారిని వాకబు చేశారు.అయితే ఎవరూ కల్నిషా తమ ఇంటికి రాలేదని తెలిపారు. దాంతో పాపకోసం కుటుంబసభ్యులు సాయంత్రం వరకు పరిసరాల్లో వెతికినా ఆచూకీ దొరకలేదు. అక్కడ ఉన్న కొందరు సాయంత్రం పాపను పార్కు చేసిన కారు వద్ద చూశామని చెప్పడంతో తల్లిదండ్రులు రాత్రి ఏడు గంటల ప్రాంతంలో కారు వద్దకు వెళ్లి డోర్ తీసి చూడగా పాప అపస్మారక స్థితిలో పడి ఉంది. దీంతో వెంటనే ఆసుపత్రికి తరలించగా.. పరీక్షించిన వైద్యులు చిన్నారి అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు.

మూడేళ్ల చిన్నారి కల్నిషా అకాల మృతి ఆ తల్లిదండ్రులకు తీరని దుఖాన్ని మిగిల్చింది. అల్లారుముద్దుగా పెరిగిన చిన్నారి మృతిచెందడంతో సాంబాయిగూడెంలో విషాదం నెలకొంది. బుధవారం ఉదయం నిర్వహించిన చిన్నారి అంత్యక్రియల్లో గ్రామస్థులంతా పాల్గొన్నారు. ఇదిలా ఉండగా పాప మృతి విషయం తెలుసుకున్న పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు సాంబాయిగూడెం చేరుకుని పాప తల్లిదండ్రులను పరామర్శించి, ఓదార్చారు.

మల్లన్న గెలుస్తుండని కేటీఆర్‌కు భయం..

- కాంగ్రెస్ సన్నాహక సమావేశంలో తీన్మార్ మల్లన్న
- మద్దతు పలికిన మున్నూరుకాపు సంఘం

మణుగూరుటౌన్/దమ్మపేట, మే 22: అమెరికాకు పోయే బీఆర్ఎస్ మాజీ మంత్రి కేటీఆర్ ఎందుకు వెనక్కి తిరిగి వచ్చిండంటే.. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో తీన్మార్ మల్లన్న గెలుస్తుండన్న భయంతోనే వెనక్కు తిరిగి వచ్చిండు.. తీన్మార్ మల్లన్నపై దుష్ప్రచారం ప్రారంభించిండని పట్టభద్రుల ఎమ్మెల్సీ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి తీన్మార్ మల్లన్న అన్నారు. బుధవారం మణుగూరు పట్టణంలోని హనుమాన్ ఫంక్షన్ హాల్‌లో జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికల సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడారు. ఓటమి భయంతోనే కేటీఆర్ తీన్మార్ మల్లన్న మంచోడు కాదు.. అని అసత్యప్రచారాలకు దిగాడు. బీఆర్ఎస్ పార్టీ నాయకుల అవినీతి, అక్రమాలను టీవీల్లో చెప్పిన తీన్మార్ మల్లన్న.. గెలిచిన తర్వాత ఆ ఆధారాలను పట్టుకుని ఎంక్వైరీలు వేయిస్తాడన్న భయంతోనే మంచోడు కాదనే ప్రచారాలు చేస్తున్నారని విమర్శించారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో గెలిస్తే నిరుద్యోగుల గొంతుకనై ప్రశ్నిస్తానని, విద్యార్థుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. ఈ సందర్భంగా పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు మాట్లాడుతూ గత అసెంబ్లీ ఎన్నికల్లో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో ఎమ్మెల్యేలను గెలిపించుకుని ముగ్గురు మంత్రులను సాధించుకున్నామని గుర్తు చేశారు. అదేవిధంగా ఎమ్మెల్సీ ఎన్నికల్లోనూ తీన్మార్ మల్లన్నను గెలిపించుకునేందుకు కాంగ్రెస్ పార్టీతోపాటు మిత్రపక్ష పార్టీల సైనికులు, కార్యకర్తలు, నాయకులందరు ఐక్యంగా ముందుకు సాగాలన్నారు. అనంతరం సమావేశంలో మున్నూరుకాపు సంఘం నాయకులు వలసలా రామారావు మాట్లాడుతూ.. తీన్మార్ మల్లన్నకు సంపూర్ణ మద్దతును తెలుపుతున్నట్లు ప్రకటించారు. కార్యక్రమంలో నాయకులు బిక్కసాని నాగేశ్వరరావు, కాటబోయిన నాగేశ్వరరావు, వాసిరెడ్డి చలపతి రావు, చక్రవర్తి, నెల్లూరి నాగేశ్వరరావు, సరెడ్డి పుల్లారెడ్డి, చందా సంతోష్, కేవీ రావు, పిరినాకి నవీన్, హుస్సేన్, ముత్తినేని సుజాత, తాళ్లూరి జగదీష్, సైదులు, జీ.కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

త్వరలోనే 'బీఆర్ఎస్' భూస్థాపితం..: తీన్మార్ మల్లన్న

బీఆర్ఎస్‌పార్టీ భూస్థాపితం అయ్యేందుకు ఎంతో కాలం పట్టదని కాంగ్రెస్‌పార్టీ ఎమ్మెల్సీ అభ్యర్థి తీన్మార్ మల్లన్న అన్నారు. గండుగులపల్లిలో అశ్వారావుపేట నియోజకవర్గ స్థాయి పట్టభద్రుల ఆత్మీయ సమ్మేళనం బుధవారం మధ్యాహ్నం ఎమ్మెల్యే జారే ఆదినారాయణ అధ్యక్షతన జరిగింది. సమావేశంలో మల్లన్న మాట్లాడుతూ దొంగ ఓట్ల పల్లా రాజేశ్వరరెడ్డి నిర్వాకం వల్లే ఎమ్మెల్సీ ఉప ఎన్నిక ఏర్పడిందని మల్లన్న విమర్శించారు. ఎన్నికలకు ముందే బీఆర్ఎస్‌పార్టీ చేతులెత్తేసిందని కనీసం ప్రచారానికి కూడా నోచుకోని దయనీయ పరిస్థితుల్లో వుందన్నారు. గత ఎమ్మెల్సీ ఎన్నికల్లో కేవలం ఆరువేల ఓట్లతోనే ఓడిపోయాయని నైతికంగా అప్పుడే మల్లన్న గెలిచాడని అందరికి తెలిసిందేనన్నారు. కాంగ్రెస్‌పార్టీ ఎన్నికల హామీలన్నీ నెరవేర్చుతుందని ఎమ్మెల్సీ అభ్యర్థిగా తనను గెలిపిస్తే ఉద్యోగాలు ఇప్పించేందుకు కాంగ్రెస్‌పార్టీ ఇచ్చిన ఉద్యోగాల హామీని నెరవేర్చేందుకు కృషి చేస్తానన్నారు. అశ్వారావుపేట నియోజక వర్గానికి డైనమిక్ ఎమ్మెల్యే మంచి ఆదరణ వున్న ఆదినారాయణను గెలిపించుకోవటం ఇక్కడి ఓటర్ల విజ్ఞతకు నిదర్శనమన్నారు. ఖమ్మం జిల్లాలో కీలక మంత్రులు భట్టి, తుమ్మల, పొంగులేటి వున్నారని, వారు అభివృద్ధిలో దూసుకు వెళుతున్నారన్నారు. ఎమ్మెల్సీ అభ్యర్థిగా తనను గెలిపిస్తే పట్టభద్రుల సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు.

ఈ సందర్భంగా అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు మల్లన్నను కలిసి మద్దతు ఇవ్వటంతోపాటు రూ.50వేల విరాళాల చెక్కును అందజేశారు. అంతకుముందు అశ్వారావుపేట ఎమ్మెల్యే జారే ఆదినారాయణ మాట్లాడారు. ఈ సమావేశంలో ఖమ్మం కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి రఘురాంరెడ్డి, అశ్వారావుపేట నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నిక ఇన్‌చార్జ్ పిడమర్తి రవి కాంగ్రెస్ జిల్లా నాయకులు నాగసీతారాములు మాట్లాడారు. ఈ సమావేశంలో అశ్వారావుపేట, దమ్మపేట, ములకలపల్లి, చండ్రుగొండ, అన్నపురెడ్డిపల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కోయల అచ్యుతరావు, కేవి సత్యనారాయణ, చిన్నంశెట్టి యుగంధర్, సీపీఎం నాయకుడు పుల్లయ్య, సీపీఐ నాయకుడు సలీం పాల్గొన్నారు.



మణుగూరులో మాట్లాడుతున్న తీన్మార్ మల్లన్న

ఎమ్మెల్సీ ఎన్నికల ముంగిట

వైరా బీఆర్ఎస్‌లో ముసలం...



వైరా, మే 22: వైరా నియోజకవర్గంలో బీఆర్ఎస్‌లో ముసలం పుట్టింది. ఈనెల 27న జరుగనున్న పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నికల ముందు బీఆర్ఎస్‌లో సంక్షోభం తలెత్తింది. ఎమ్మెల్సీ ఎన్నికలకు వైరా అసెంబ్లీ నియోజకవర్గ బీఆర్ఎస్ ఇన్‌చార్జ్ జూలూరుపాడు మండలానికి చెందిన లకావత్ గిరిబాబు నియామకంతో ఆపార్టీలో విభేదాలు బహిర్గతమయ్యాయి. ఏకంగా బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తాతా మధుసూదన్, ఎంపీ ఎన్నికల వరకు అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జ్‌గా ఉన్న మాజీ ఎమ్మెల్యే బాణోతు మదన్‌లాల్ మధ్య తీవ్ర అగాధం ఏర్పడింది. ఎంపీ ఎన్నికల సమయంలో నియోజకవర్గ ఇన్‌చార్జ్‌గా ఉన్న మదన్‌లాల్ వ్యవహారశైలి కారణంగా ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఆయన స్థానంలో గిరిబాబును నియోజకవర్గ ఇన్‌చార్జ్‌గా పార్టీ అధినాయకత్వం ఆదేశాల మేరకు నియమించారు. గతేడాది నవంబరు 30న జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో అప్పటి ఎమ్మెల్యే లావుడ్యా రాములునాయక్‌ను కాదని 2018లో ఆయన చేతిలో ఓడిపోయిన మాజీ ఎమ్మెల్యే మదన్‌లాల్‌కు బీఆర్ఎస్ అధిష్ఠానం టిక్కెట్ కేటాయించింది. నవంబరులో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి మాలోతు రాందాస్‌నాయక్‌పై మదన్‌లాల్ 33,045ఓట్ల తేడాతో ఓడిపోయారు. అయితే ఈనెల 13న జరిగిన ఎంపీ ఎన్నికల సందర్భంగా వైరా నియోజకవర్గ బీఆర్ఎస్ ఇన్‌చార్జ్‌గా మదన్‌లాల్‌ను పార్టీ అధిష్ఠానం కొనసాగించింది. దాంతో ఎమ్మెల్యే టిక్కెట్ ఇవ్వకుండా అవమానించడమేకాకుండా గతంలో తనపై ఇప్పుడు రెండోసారి ఓడిపోయిన మదన్‌లాల్‌ను ఇన్‌చార్జ్‌గా నియమించడంతో మాజీ ఎమ్మెల్యే లావుడ్యా రాములునాయక్ ఆపార్టీకి గుడ్‌బై చెప్పారు. అయితే ఎంపీ ఎన్నికల్లో ఇన్‌చార్జ్‌గా ఉన్న మదన్‌లాల్ నియోజకవర్గంలో ఎన్నికల కార్యకలాపాల కోసం ప్రత్యేకంగా తనకు ఆర్థిక వనరులు సమకూర్చాలని ఎంపీ అభ్యర్థి నామా నాగేశ్వరరావుకు షరతులు పెట్టి వత్తిడి చేశారని ఆపార్టీ వర్గాల్లో తీవ్ర చర్చ, విమర్శలు చోటుచేసుకున్నాయి. వైరా ఇన్‌చార్జ్‌పై నామా కూడా అసంతృప్తి వ్యక్తం చేయడమే కాకుండా ఆయన వ్యవహారశైలిపై పార్టీ అధిష్ఠానానికి ఫిర్యాదు చేసినట్టు ప్రచారం జరిగింది. వీటన్నింటి కారణంగా ఎమ్మెల్సీ ఎన్నికలకు వైరా ఇన్‌చార్జ్‌గా లకావత్ గిరిబాబును జిల్లా అధ్యక్షుడు తాతా మధుసూదన్ నియమించారని చర్చ ఉంది. దాంతో సింగరేణి మండలంలోని మదన్‌లాల్ వర్గీయులు సోషల్‌మీడియా వేదికగా అలాగే బహిరంగంగా తాతా మధుసూదన్‌పై తీవ్ర విమర్శలు గుప్పించారు. మదన్‌లాల్ ఓటమికి తాతా మధుసూదన్ కారణమని ఆయనను పార్టీ జిల్లా అధ్యక్ష పదవి నుంచి తప్పించాలని డిమాండ్ చేశారు. అదే సందర్భంలో సింగరేణికే చెందిన మరో వర్గం నాయకులు మదన్‌లాల్‌పై తీవ్ర విమర్శలు గుప్పించారు. బీఆర్ఎస్ అధికారం కోల్పోయిన తర్వాత నియోజకవర్గ వ్యాప్తంగా కాంగ్రెస్‌లోకి భారీ వలసలు జరిగాయి. దాంతో ఆపార్టీ కునారిల్లుతుంది. మధుసూదన్, మదన్‌లాల్ వర్గాల మధ్య చోటుచేసుకున్న పరిణామాలపై అధిష్ఠానం సీరియస్‌గా ఉన్నట్లు చర్చ జరుగుతుంది. ఎమ్మెల్సీ ఎన్నికల తర్వాత వైరా వ్యవహారంపై బీఆర్ఎస్ అధిష్ఠానం చర్యలు తీసుకొనే అవకాశమున్నట్టు తెలిసింది.

ఓటుతోపాటు బాధ్యత అప్పగిస్తున్నారు

- విద్యా, వైద్యంపై ప్రభుత్వం తీరు మారాలని పోరాటం: మల్లన్న
- పట్టభద్రులారా మల్లన్నను ఆశీర్వదించండి... ఎమ్మెల్యే రాగమయి

సత్తుపల్లి, మే 22:సత్తుపల్లి నియోజకవర్గ ఓటర్లు తనకు ఓటు వేయడంతోపాటు అభివృద్ధి చేయాల్సిన బాధ్యతను అప్పగిస్తున్నారని వరంగల్, నల్గొండ, ఖమ్మం పట్టభద్రుల ఎమ్మెల్సీ కాంగ్రెస్ అభ్యర్థి తీన్మార్ మల్లన్న అన్నారు. ఉప ఎన్నికల నేపథ్యంలో సత్తుపల్లిలోని లక్ష్మీప్రసన్న ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించిన ఆత్మీయ సమావేశంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. రాష్ట్రంలో సమస్యలపై గళమెత్తి బీఆర్ఎస్ ప్రభుత్వ కుంభకోణాలు, అవినీతి, చీకటి ఒప్పందాలను బయటపెట్టిన ఏకైక వ్యక్తిని తానేనని, వీటిల్లో ఏ ఒక్క అంశానైన్నా తప్పని నిరూపిస్తే ముక్కు నేలకు రాస్తానని శపథం చేశారు. ప్రజలను హింసించిన బీఆర్ఎస్, కార్పొరేట్ శక్తులకు ఊడిగం చేస్తున్న బీజేపీ అభ్యర్థులు ఈ ఎన్నికల తర్వాత కనిపించరని అన్నారు. మోదీ ప్రకటించిన 2కోట్ల ఉద్యోగాలు, కేసీఆర్ ప్రకటించిన 2లక్షల ఉద్యోగాలు ఎటుపోయాయో మీ వద్దకు ప్రచారానికి వచ్చే ఆయా పార్టీల అభ్యర్థులను ప్రశ్నించాలని పట్టభద్రులను కోరారు. విద్యావైద్యంపై ప్రభుత్వం తీరు మారాలని పోరాటం చేసిన తనకు మద్దతు తెలిపి ఓటువేసి గెలిపించాలని అభ్యర్థించారు. తన కుటుంబాన్ని వేధించిన కేసీఆర్ బిడ్డలు ఇప్పుడు ఏం చేస్తున్నారో యావత్ ప్రపంచం చూస్తూనే ఉందని, ఒకరు సారా దందా చేయగా మరోకరిని నమ్మలేని ప్రజలు కాంగ్రెస్ పార్టీకి అనుకూలంగా తీర్పు ఇచ్చారన్నారు.

మల్లన్నను ఆశీర్వదించండి: ఎమ్మెల్యే రాగమయి

ప్రతి సమస్యపై అవగాహన ఉన్న వ్యక్తి మల్లన్న అని, బీఆర్ఎస్ అవినీతిని ఎండగట్టి అధికార పార్టీపై ధైర్యంగా పోరాటం చేసిన తీన్మార్ మల్లన్నను గెలిపించాలని సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి కోరారు. అధికారం, ధనబలంతో గెలిచి మనందరినీ నట్టేట ముంచిన బీఆర్ఎస్‌ను నిరుద్యోగులు, ఉద్యోగులు, కళాశాలల యాజమాన్యాలు ఆలోచించి ఓటు వేయాలని కోరారు. 16వేల కోట్లు ప్రభుత్వ షేర్లను అమ్మేసిన బీజేపీ, నీళ్లు, నిధులు, ఉద్యోగాలు ఇస్తామన్న బీఆర్ఎస్‌లను నమ్మవద్దని కాంగ్రెస్ పార్టీ తరపున ఖమ్మం పార్లమెంట్ అభ్యర్థిగా పోటీచేసిన రామసహాయం రఘురాంరెడ్డి అన్నారు. కార్యక్రమంలో గిడ్డంగుల కార్పోరేషన్ రాష్ట్ర చైర్మన్ రాయల నాగేశ్వరరావు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు డాక్టర్ మట్టా దయానంద్, ఉడతనేని అప్పారావు, నరసింహారావు, చెన్నారావు పాల్గొన్నారు.



సత్తుపల్లిలో మాట్లాడుతున్న తీన్మార్ మల్లన్న

పలువురు మల్లన్నకు మద్దతు

సత్తుపల్లిలో పర్యటించిన తీన్మార్ మల్లన్నకు ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యం, ఉపాధ్యాయులు, తెలంగాణ సిటీజన్స్ ఫోరం మద్దతు తెలిపారు.

పట్టభద్రుల ఉప ఎన్నికలు

పకడ్బందీగా నిర్వహించాలి

- వీడియోకాన్ఫరెన్స్‌లో ప్రధాన ఎన్నికల అధికారి వికాస్‌రాజ్

ఖమ్మం కలెక్టరేట్, మే 22:పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నికలను పకడ్బందిగా నిర్వహించాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్ రాజ్ ఆదేశించారు. బుధవారం హైదరాబాద్ నుండి వరంగల్- ఖమ్మం- నల్గొండ శాసనమండలి పట్టభద్రుల ఉప ఎన్నికల ఏర్పాట్లపై 12 జిల్లాల కలెక్టర్లు, రెవెన్యూ అదనపు కలెక్టర్లు, ఏఆర్ఓలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. శాసనమండలి పట్టభద్రుల ఉప ఎన్నికల ఏర్పాట్లపై జిల్లా కలెక్టర్లతో సమీక్షించారు.కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి జిల్లా కలెక్టర్ వీపీ గౌతమ్, అదనపు కలెక్టర్ డి. మధుసూదన్ నాయక్ తో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్ రాజ్ మాట్లాడుతూ, శాసన మండలి పట్టభద్రుల ఉప ఎన్నికను ఆషామాషీగా తీసుకోవద్దన్నారు. పోస్టల్ బ్యాలెట్ వినియోగించుకునే ఉద్యోగులకు ఓటర్ ఫెసిలిటేషన్ కేంద్రాలపై అవగాహన కల్పించాలన్నారు. ఎన్నికలలో ఓటు వేసేందుకు ఎన్నికల సంఘం సరఫరా చేసిన వైలెట్ కలర్ స్కెచ్ పెన్, ఇండెలిబుల్ ఇంకులు మాత్రమే వినియోగించాలన్నారు. ఇటీవల పార్లమెంట్ ఎన్నికలు ముగిసిన నేపథ్యంలో ఎమ్మెల్సీ ఎన్నికలలో ఓటరు ఎడమ చేయి మధ్య వేలుకు ఇండెలిబుల్ ఇంక్ మార్కు చేయాలన్నారు, ఎన్నికలలో పోటీ చేస్తున్న అభ్యర్థుల జాబితాను ప్రతి పోలింగ్ కేంద్రం వద్ద బయట ప్రదర్శించాలని, ఓటర్లు ఓటు ఎలా వేయాలో ప్రతి పోలింగ్‌స్టేషన్ వద్ద ఫ్లెక్సీని ఏర్పాటు చేయాలని అన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా రెవిన్యూ అధికారిణి ఎం. రాజేశ్వరి, జడ్పీ సీఈవో. వినోద్, డీఆర్డీవో సన్యాసయ్య, ఆర్డీవోలు జి. గణేష్, ఎల్. రాజేందర్, కలెక్టరేట్ ఏవో. అరుణ, ఎన్నికల విభాగ సూపరింటెండెంట్ రాంబాబు, మదన్ గోపాల్ తదితరులు పాల్గొన్నారు.



వీడియోకాన్ఫరెన్స్‌లో కలెక్టర్, సీపీ

లోక్‌సభ ఓట్ల లెక్కింపునకు పకడ్బందీ ఏర్పాట్లు

(5వ పేజీ తరువాయి)

జిల్లా వ్యాప్తంగా 118 పోలింగ్ కేంద్రాల ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పోలింగ్ ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు జరుగుతుందన్నారు. బ్యాలెట్ పేపర్ల ద్వారా పోలింగ్ జరుగుతుందని, దీనికోసం రిజర్వ్‌తో సహా 129 బ్యాలెట్ బాక్సులు సిద్ధం చేసినట్లు తెలిపారు. 15సెక్టార్‌లు ఏర్పాటుచేసి, తహసీల్దార్లను సెక్టార్ అధికారులుగా నియమించినట్లు వివరించారు. 26న ఖమ్మంలోని ఎస్ఆర్‌అండ్ బీజీఎన్ఆర్ డిగ్రీ కళాశాలలో డిస్ట్రిబ్యూషన్ కేంద్రం ఏర్పాటుచేసి పోలింగ్ అనంతరం బ్యాలెట్ బాక్సులు నల్లగొండలోని స్ట్రాంగ్ రూంకు పంపనున్నట్లు తెలిపారు. కౌంటింగ్ జూన్ 5 న నల్లగొండలో జరుగుతుందన్నారు. ఎమ్మెల్సీ ఉప ఎన్నిక బరిలో 52 మంది అభ్యర్థులు, నోటాతో కలుపుకుని 53మంది పోటీలో ఉన్నట్లు తెలిపారు. ఓటర్లు ప్రాధాన్యత క్రమంగా తమ ఓటును వేయాల్సి ఉంటుందని తెలిపారు. ఓటు వేయాల్సిన ప్రక్రియపై కలెక్టర్ గౌతమ్ అవగాహన కల్పించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ డి. మధుసూదన్‌నాయక్, ఎన్నికల విభాగ సూపరింటెండెంట్ రాంబాబు, పోటీ అభ్యర్థులు, రాజకీయ పార్టీల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

హెచ్‌సీఏ క్రికెట్ జట్టు ఎంపికలకు స్పందన

ఖమ్మం స్పోర్ట్స్, మే 22: జిల్లా క్రికెట్ అసోసియేషన్ (హెచ్‌సీఏ) ఆధ్వర్యంలో బుధవారం నగరంలోని పెవీలియన్ గ్రౌండ్‌లో నిర్వహించిన ఉమ్మడి జిల్లా క్రికెట్ జట్టు ఎంపికలకు విశేష స్పందన లభించింది. ఎంపికలకు ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల నుంచి సుమారు 90 మంది క్రీడాకారులు హాజరైనారు. సెలెక్షన్స్‌కు క్రీడాకారులు భారీగా రావడంతో నిర్వాహకులు ఎంపికలను రెండు రోజుల పాటు నిర్వహించారు. ఎంపికల్లో ప్రతిభ చూపిన క్రీడాకారులను జిల్లా జట్టుకు ఎంపిక చేశారు. ఉమ్మడి జిల్లా క్రికెట్ జట్టులో నారాయణ, సమీర్, వంశీ, సాయిచంద్, విశాల్‌యాదవ్, తేజారామ్, నాగేంద్ర, ఫరీద్, లోకేష్, సమీర్, రియాజ్, శశి, బన్నీ, మెహిత్, శివన్, డివిన్ లకు చోటు కల్పించినట్లు జిల్లా క్రికెట్ సంఘ సెక్రెటరీ చేకూరి వెంకట్ తెలిపారు. వారు ఈనెల 24 నుంచి 30 వరకు హైదరాబాద్ ఉప్పల్ స్టేడియంలో జరగనున్న అంతర జిల్లాల టీ-20 క్రికెట్ టోర్నమెంట్‌లో ఉమ్మడి ఖమ్మం జిల్లా జట్టు తరుపున పాల్గొంటారని తెలిపారు. ఎంపికలను జిల్లా క్రికెట్ అసోసియేషన్ మేనేజర్ ఫారూఖ్, సెలెక్టర్ తురబ్‌అలీ సమీక్షించారు.

మాజీ ఎమ్మెల్యే పెండ్యాలకు మంత్రి తుమ్మల నివాళి



నివాళులు అర్పిస్తున్న మంత్రి తుమ్మల

ఖమ్మం సంక్షేమవిభాగం, మే 22: తెలుగుదేశం సీనియర్ నాయకుడు, కొవ్వూరు మాజీ ఎమ్మెల్యే పెండ్యాల వెంకటకృష్ణరావు (కృష్ణబాబు) బుధవారం అనారోగ్యంతో కన్నుమూశారు. విషయం తెలుసుకున్న రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు హుటాహుటీనా పెండ్యాల వెంకటకృష్ణరావు స్వగ్రామం దొమ్మెర చేరుకున్నారు. వెంకటకృష్ణరావు భౌతికకాయంపై పుష్పగుచ్చా లను ఉంచి నివాళులు అర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఉమ్మడి తెలుగురాష్ట్రం మాజీ మంత్రులు అయ్యన్నపాత్రుడు, నన్నపనేని రాకుమారి, బుచ్చిడి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

మహిళపై దాడి: ముగ్గురిపై కేసు నమోదు

పాల్వంచ, మే 22: మహిళపై దాడి చేసిన ఘటనలో ముగ్గురిపై పాల్వంచ రూరల్ పోలీసులు బుధవారం కేసు నమోదు చేశారు. మండల పరిధిలోని పాతసూరారం గ్రామానికి చెందిన స్వరూపకు పెళ్లి సంబందం మాట్లాడుకోవడానికి శిరీష, మంగమ్మ, హరి, బిందులు సమావేశమయ్యారు. మాట్లాడుకునే క్రమంలో శిరీషకు మిగిలిన ముగ్గురి మధ్య వాదనలు మొదలయ్యాయి. దీంతో వారు ముగ్గురు కలని శిరీషను దుర్భాషలాడటమే కాక ప్లాస్టిక్ పైపుతో శిరీషపై దాడి చేసి గాయపరిచారు. శిరీష ఫిర్యాదు మేరకు మంగమ్మ, హరి, బిందులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ ఎస్ఐ శ్రీనివాస్ తెలిపారు.

ప్లాస్టిక్ వ్యర్థాలు లేని పంచాయతీలే లక్ష్యం

- కోటపాడులో పంచాయతీ సిబ్బందిపై ప్రత్యేక కమిషనర్ శేషుకుమార్ ఆగ్రహం
- మండలంలో శ్మశాన వాటికలు, నర్సరీలు, ప్రకృతి వనాలు ఆకస్మిక తనిఖీ

రఘునాథపాలెం, మే 22: గ్రామల్లో ఎక్కడ పడితే అక్కడ ప్లాస్టిక్ వ్యర్థాలు కనిపిస్తున్నాయని గ్రామాల్లో ప్రజలకు అవగాహన కల్పించాలని రాష్ట్ర గ్రామీణాభివృద్ధిశాఖ ప్రత్యేక కమిషనర్ శేషుకుమార్ కోటపాడు గ్రామ పంచాయతీ అధికారిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్లాస్టిక్ వ్యర్థాలు లేని గ్రామ పంచాయతీలే లక్ష్యంగా పనిచేయాలని ఆదేశించారు. బుధవారం ఖమ్మం జిల్లా పర్యాటనకు వచ్చిన ఆయన రఘునాథపాలెం మండలంలో కోటపాడు గ్రామ పంచాయతీలో పర్యటించారు. రహదారి వెంట గుట్టలుగా ఉన్న ప్లాస్టిక్ వ్యర్థాలపై స్పందించారు. ఎందుకు ఇలా ఉంచా రని పంచాయతీ కార్యదర్శిని ప్రశ్నించారు. దీంతో స్పందించిన కార్యదర్శి గ్రామంలో ఓ ఇంట్లో భోజనాల కార్యక్రమం ఏర్పాటు చేయటంతో వ్యర్థాలు వ్యాపించాయని వివరించే ప్రయత్నం చేశారు. దీంతో ఆగ్రహించిన కమిషనర్ గ్రామస్థులు ఎటువంటి ఫంక్షన్‌లు చేసినా వాటిలో ప్లాస్టిక్ వ్యర్థాలు లేకుండా గ్రామ పంచాయతీ సిబ్బంది అవగాహన కల్పించాలని, పర్యవేక్షణ చేయాలని ఆదేశించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రవేశ పెట్టే అభివృద్ధి పథకాలను గ్రామ పంచాయతీలు స్థిర ఆస్తులుగా మార్చుకొని వాటి ద్వారా గ్రామ పంచాయతీలు ఆధాయం పెంచుకునేలా కార్యాచరణ చేయాలని కమిషనర్ శేషుకుమార్ ఆదేశించారు. గ్రామ పంచాయతీలో పల్లే ప్రకృతి వనాలు, డంపింగ్‌యార్డు, నర్సరీలు పరిశీలించారు. తడి పొడి చేత్త సేకరణ రికార్డులను తనిఖీలు చేశారు. పంచాయతీకి కేటాయించిన ట్రాక్టర్ వినియోగంపై ప్రశ్నించారు. క్రీడా ప్రాంగణంలోకి వెళ్లి ఆటలు ఆడుతున్న పిల్లలతో మాట్లాడారు. ప్రభుత్వం కల్పించిన అభివృద్ధి పథకాలను సద్వినియోగం చేసుకొని వాటి ద్వారా ఏలా గ్రామ పంచాయతీకి ఆధాయం పెంచుకోవాలో సుదీర్ఘంగా వివరించారు. ప్లాస్టిక్ వ్యర్థాల ద్వారా ఎంత ఆదాయం గ్రామ పంచాయతీ ద్వారా ఖజానాకు జమ చేశారో తనిఖీ చేశారు. తర్వాత కోయచెలకలో స్మశాణ వాటికను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. నిర్వాహణ బాగుందని అభినందించారు. ఎంపీడీవో, ఏపీవో పాల్గొన్నారు.



శ్మశాన వాటికను పరిశీలిస్తున్న ప్రత్యేక కమిషనర్

నేడు యోగానంద లక్ష్మీనరసింహస్వామి కల్యాణం

- సంప్రదాయంగా ధ్వజారోహణం, ఎదుర్కోలు
- నరసింహ జయంతి సందర్భంగా అభిషేకం

భద్రాచలం, మే 22: భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్ర స్వామి దేవస్థానం అనుబంధ ఆలయమైన శ్రీ యోగానంద లక్ష్మీనరసింహస్వామి వారి ఆలయంలో స్వామి వారికి గురువారం కల్యాణం నిర్వహించనున్నారు. ఆలయంలో బుధవారం నాడు స్వామివారి తిరుకల్యాణ బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని ధ్వజారోహణం, అగ్ని ప్రతిష్ట, ఎదుర్కోలు ఉత్సవాలను సంప్రదాయబద్దంగా నిర్వహించారు. బ్రహ్మోత్సవాలను ఈ నెల 21 నుంచి 26 వరకు నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం ప్రధాన అర్చకులు అమరవాది విజయరాఘవన్, ఉప ప్రధాన అర్చకులు అమరవాది శ్రీనివాస రామానుజం, అర్చకులు సౌమిత్రి శ్రీనివాసాచార్యులు, అమరవాది వెంకట్రామన్‌లు పాల్గొన్నారు. ఇదిలా ఉండగా శ్రీ యోగానందలక్ష్మీనరసింహ స్వామి జయంతి(తిరునక్షత్రం) సందర్భంగా స్వామి వారికి ప్రత్యేక అభిషేకం, పూజలు నిర్వహించారు.

బంగారు పూత కవచాలు సమర్పించిన షార్జా భక్తులు

యునైటెడ్ అరబ్ ఎమిరైట్స్‌లోని షార్జాకు చెందిన ఎరోదుల రవిశంకర్, సునీత వారి కుటుంబ సభ్యులు యోగానంద లక్ష్మీనరసింహ స్వామికి బంగారుపూత కవచాలను సమర్పించారు. ఈ సందర్భంగా వైదిక సిబ్బంది సంప్రోక్షణ నిర్వహించి వాటిని స్వామి వారికి ధరింపజేశారు.



ధ్వజారోహణం నిర్వహిస్తున్న దృశ్యం

'ధరణి' పెండింగ్ దరఖాస్తుల పరిష్కారాన్ని వేగిరం చేయాలి

- సమీక్ష సమావేశంలో కలెక్టర్ వీపీ గౌతమ్

ఖమ్మం కలెక్టరేట్, మే 22: ధరణి పెండింగ్ దరఖాస్తుల పరిష్కారాన్ని మరింతవేగం పెంచాలని ఖమ్మం కలెక్టర్ వీపీ గౌతమ్ ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ సమావేశం మందిరంలో ఆర్డీవోలు, తహసీల్దార్లతో ధరణీ దరఖాస్తుల పరిష్కారంపై కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ, ధరణి పెండింగ్ దరఖాస్తులను నెలాఖరులోగా పరిష్కరించాలన్నారు. ప్రతిరోజు తహసీల్దార్ కనీసం 25 ఫైళ్లు సమర్పించాలన్నారు. రిజిస్ట్రేషన్ లలో పెండింగ్ స్లాట్లపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ డి. మధుసూదన్ నాయక్, జిల్లా రెవెన్యూ అధికారి రాజేశ్వరి, ఖమ్మం, కల్లూరు ఆర్డీవోలు జి. గణేష్, ఎల్. రాజేంద్ర గౌడ్, తహసీల్దార్లు తదితరులు పాల్గొన్నారు.

నత్తనడకన 'మనబడి' పనులు

- ఇంకా అసంపూర్తి కానీ తొలి విడత పనులు
- గత ఏడాది మేలోనే గడువు పూర్తి
- అయినా ఇంకా కొనసాగుతున్న నిర్మాణాలు

ఖమ్మం ఖానాపురం హవేలీ, మే 22: మొదటి విడతకు ఉమ్మడి ఖమ్మం జిల్లా నుంచి ఎంపికైన పాఠశాలల్లో అన్ని వసతులు సమకూరుతున్నాయి. ఇప్పటికే 233 ప్రభుత్వ పాఠశాలల్లో 100శాతం పనులు పూర్తయ్యాయి. 90శాతానికి పైగా 33 పాఠశాల్లో, 60శాతానికి పైగా 85పాఠశాలల్లో, 50శాతం కంటే తక్కువగా 94 పాఠశాల్లో పనులు పురోగతిలో ఉన్నాయి. ఖమ్మం జిల్లాలోని వివిధ మండలాల్లోని పాఠశాలలు, జలగంనగర్, కైకొండాయిగుడెం, మంచుకొండ, కామంచికల్, వి వెంకటాయపాలెం, రఘునాథపాలెంతో పాటు వివిధ గ్రామాల్లోని పాఠశాలల్లో పనులు అసంపూర్తిగానే ఉన్నాయి.

అదనపు గదుల ఊసేదీ ?

మౌలిక సదుపాయాలతో పాటు విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా తరగతి గదులు నిర్మించాలని మనఊరు-మనబడి ప్రణాళిక కింద నిర్ణయించారు. కానీ నిధులు ఎక్కువగా ఖర్చయ్యే అవకాశం ఉండడంతో అదనపు గదులను చేపట్టేందుకు అంచనాలు రూపొందించలేదు. కేవలం చిన్న చిన్న మరమ్మతు పనులతో పాటు మౌలిక సౌకర్యాలకు మాత్రమే నిధులు వెచ్చించినట్లు తెలిసింది. విద్యార్థుల సంఖ్య తక్కువ ఉన్న పాఠశాలను విస్మరించారు. కనీసం ఆ పాఠశాలలో చిన్నచిన్న పనులకు కూడా ఎంపిక చేయకపోవడం గమనార్హం.

చదువులకు ఆటంకం కలగకుండా..

మనఊరు-మనబడి కార్యక్రమం ద్వారా చేపట్టే పనులు వేసవి సెలవుల్లో పూర్తి చేయాల్సిఉన్నా పూర్తికాలేదు. బోధించే సమయంలో పనులు చేపడితే చదువులకు ఆటంకం కలగనుంది. కానీ బడులు ప్రారంభమైనా పనులు కొనసాగుతూనే ఉన్నాయి.

ఇప్పటివరకు కొన్నిపాఠశాలల్లో మూత్రశాలలు, మరుగుదొడ్ల పనులు పూర్తికాలేదు. అరకొరగా నిర్మించిన సిమెంట్ పనుల్లో నాణ్యత పాటించకుండా నాసిరకంగా పనులు చేపట్టి చేతులు దులుపుకున్నారు. అధికారుల పర్యవేక్షణ లేక కాంట్రాక్టర్లు ఇష్టానుసారంతో ప్రభుత్వ నిధులతో చేపడుతున్న ప్రభుత్వ పాఠశాలల మౌలిక వసతులు కొన్ని పాఠశాలల్లో పూర్తిచేసినా కొంతమేర పనులు అర్ధాంతరంగా నిలిచిపోయాయి. చేసిన పనులకు బిల్లులు రాక, పూర్తి పనులు చేయలేక కాంట్రాక్టర్లు చేతులెత్తేయడంతో పాఠశాల ఆవరణలో మట్టి పెల్లలు, పాతగోడల ఇటుకలు, దుమ్ము పేరుకుపోయాయి.

తొలి విడతలో చేయాల్సిన పనులు

అధికారులు మొదటి విడతకు ఉమ్మడి ఖమ్మం జిల్లా నుంచి 794 స్కూళ్లు ఎంపిక చేసి 12 రకాల పనులను గుర్తించారు. ఉభయ జిల్లాల కలెక్టర్లు ఎప్పటికప్పుడు సమీక్షలు నిర్వహిస్తూ యుద్ధప్రాతిపదికన పనులు పూర్తి చేయాలని భావించారు. అయినా పనులు మాత్రం పూర్తి కాలేదు. రాష్ట్ర ప్రభుత్వం ఉపాధి హామీ పథకం నిధులతో పాఠశాలల్లో మరుగుదొడ్లు, వంట గదులు, ప్రహరీలు నిర్మిస్తోంది. తాగునీటి వసతి కల్పిస్తోంది. నామినేషన్ పద్ధతిలో పనులు చేపడుతున్నది. 'మనఊరు-మనబడి'కి ఎంపికైన పాఠశాలల్లో ఇప్పటికే విద్యార్థులు కూర్చునేందుకు బల్లలు, విద్యుదీకరణ డ్యూయల్ డెస్క్ బెంచీలు, డిజిటల్ స్మార్ట్ క్లాస్ పరికరాలు, గ్రిన్ చాక్‌బోర్డులు, కంప్యూటర్, సైన్స్ ల్యాబ్, ఫర్నిచర్ అందుబాటులోకి తెచ్చేందుకు ప్రయత్నిస్తున్నారు. పాఠశాలల్లో గ్రీనరీకి ప్రాధాన్యం ఇచ్చి మొక్కలు పెంచుతున్నారు.

ఖమ్మం జిల్లా వ్యాప్తంగా..

ఖమ్మం జిల్లావ్యాప్తంగా తొలివిడత 'మన ఊరు-మనబడి మన ఊరు-మనబస్తీ'కి 426 ప్రభుత్వ పాఠశాలలు ఎంపికయ్యాయి. ప్రస్తుతం జిల్లావ్యాప్తంగా 233పాఠశాలల్లో 100శాతం పనులు పూర్తయ్యాయి. రాష్ట్ర సర్కార్ పనులకు రూ.9.87కోట్ల నిధులు వెచ్చించి 12రకాల పనులు చేయించింది. దీనికి సంబందించి రూ.34కోట్లకు గాను ఇప్పటి వరకు రూ.30కోట్లను విడుదల చేసింది. మెత్తం 426 పాఠశాలలకు సంభందించి రూ.62కోట్ల 65లక్షల విలువైన పనులను గుర్తించారు. వీటిలో రూ.21కోట్ల 96 లక్షలు పనులకు సంభందించి బిల్లులు అందినట్లు విద్యాశాఖ అధికారులు తెలిపారు. మిగిలిన రూ.39 కోట్ల 60లక్షల పనులు బిల్లులు ప్రస్తుతం పెండింగ్‌లో ఉన్నట్లు అధికారుల లెక్కలే చెబుతున్నాయి. పనులు పూర్తైన పాఠశాలల్లోనూ కొన్ని పనులు పెండింగ్‌లో ఉంచినట్లు తెలుస్తోంది. వాటర్‌లైన్, కరెంట్, కిచెన్ షెడ్స్‌లలో చిన్నచిన్న పనులు కాంట్రాక్టర్లు పెండింగ్‌లో ఉంచినట్లు తెలుస్తోంది. కాగా పనులు పూర్తయిన పాఠశాలలకు బిల్లులు కొన్ని పెండింగ్‌లో ఉన్నట్లు కొందరు కాంట్రాక్టర్ల వాపోతున్నారు.

అమ్మ ఆదర్శ పాఠశాలలు

రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసిన తరువాత అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీ పేరుతో ఖమ్మం జిల్లాలోని 21మండలాల్లో 753 ప్రభుత్వ పాఠశాలలో కరెంట్, తాగునీరు, మూత్రశాలలు, మేజర్ రిపేర్ల మరమ్మతులకు సంబంధించి ప్రభుత్వం రూ.21కోట్లా 38లక్షలు మంజూరు చేసింది. మ్మొతం 753 పాఠశాలలకు కాను 217 పాఠశాలల్లోనే పనులు పూర్తయినట్లు విద్యాశాఖ అధికారులు లెక్కల ప్రకారం తెలుస్తోంది. మిగిలిన పాఠశాలల్లో పనులు పూర్తిచేయటంలో కాంట్రాక్టర్లు నిర్లక్ష్యంగా ఉన్నట్లు తెలుస్తోంది. కానీ పాఠశాలల ప్రారంభం నాటికి పనులు పూర్తిచేయాల్సిన అధికారులు పనులపై శ్రద్ధ చూపటంలో నిర్లక్ష్యంగా చేస్తున్నట్లు విమర్శలు వినిపిస్తున్నాయి. పనులు సకాలంలో పూర్తిచేయని కాంట్రాక్టర్లపై ఎందుకు చర్యలు తీసుకోవటంలేదో తెలియని పరిస్థితి నెలకొంది.

సత్తుపల్లిలో లక్షల టన్నుల బొగ్గు నిల్వలు

- రోడ్డు మార్గంలో 13 లక్షల టన్నుల బొగ్గు తరలింపునకు ఏర్పాట్లు
- టెండర్లు ఆహ్వానించిన సింగరేణి సంస్థ
- రోడ్డు రవాణాతో వాతావరణ కాలుష్యం తప్పదని స్థానికుల అసంతృప్తి
- విద్యుత్ ఉత్పత్తి సంస్థలకు సరఫరాకోసం రోడ్డు రవాణా తప్పదంటున్న అధికారులు
- సామర్థ్యానికి మించి రైల్వే మార్గంలో రవాణా



సత్తుపల్లి, మే 21: సత్తుపల్లిలోని సింగరేణి సంస్థ ఆధ్వర్యంలోని ఓపెన్ కాస్టుల్లో ఉత్పత్తి అయిన బొగ్గు నిల్వలు ఆయా ఓసీల్లో లక్షలాది టన్నులు పేరుకొని పోయాయి. ప్రతిరోజు ఉత్పత్తి అవుతున్న బొగ్గును సత్తుపల్లిలోని సీహెచ్‌పీ ద్వారా రైల్వే ర్యాకులకు లోడింగ్ చేసి కొత్తగూడెం రైలు మార్గంలో తరలిస్తున్నారు. ఇంకా పెద్ద మొత్తంలో బొగ్గు నిల్వలు ఉండటం, ఓపెన్ కాస్టుల్లో నిల్వ ఉన్న బొగ్గును విద్యుత్ ఉత్పత్తికి తక్షణమే తరలించాలనే ఆదేశాల మేరకు వాటిని ఇక్కడి నుంచి రోడ్డు మార్గంలో తరలించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఒక పక్క సామర్థ్యం మేరకు రైల్వే లైను ద్వారా సత్తుపల్లి నుంచి బొగ్గు తరలిస్తూండగా ఇంకా మిగిలిన ఉన్న బొగ్గు నిల్వలను రోడ్డు మార్గం ద్వారా తరలించాలని నిర్ణయించి టెండర్లు పిలిచారు.

లక్ష్యానికి మించి ఉత్పత్తి

సత్తుపల్లిలోని కిష్టారం, జేవీఆర్ ఓసీలలో ప్రతి ఏటా లక్ష్యానికి మించి బొగ్గు ఉత్పత్తి జరుగుతోంది. కిష్టారం ఓపెన్ కాస్టు నుంచి 20లక్షల టన్నులు, జేవీఆర్ ఓసీ నుంచి 100లక్షల టన్నుల బొగ్గు గత ఏడాది ఉత్పత్తి చేశారు. ఈ ఆర్థిక సంవత్సరంలో అంతకు మించి ఉత్పత్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. 2021 వరకూ ఇక్కడ ఉత్పత్తి అయిన బొగ్గు లారీల్లో కొత్తగూడెం రవాణా చేశారు. ఆ తరువాత అక్కడి నుంచి ఓపెన్ కాస్టుల వరకూ రైల్వే లైను నిర్మించటంతో అప్పటి నుంచి రైల్వే లైను ద్వారా బొగ్గు రవాణా సాగుతోంది. దీంతో స్థానిక లారీలకు బొగ్గు రవాణా అవకాశాలు, కిరాయిలు గణనీయంగా తగ్గాయి.

రోజుకు ఎనిమిది ర్యాకుల బొగ్గు రవాణా

స్థానిక జేవీఆర్ ఓసీ, కిష్టారం ఓసీలలో ఉత్పత్తి అయిన బొగ్గును ప్రతి రోజు సగటున 8ర్యాకులు తరలిస్తున్నారు. ఒక్కో రాకుకు నాలుగు వేల టన్నుల చొప్పున ప్రతి రోజూ 32వేల టన్నుల బొగ్గు ఇక్కడి నుంచి కొత్తగూడెం రవాణా జరుగుతోంది. కొన్ని సందర్భాల్లో 9 రాకుల బొగ్గు రవాణా చేస్తున్నట్లు అధికారులు చెపుతున్నారు.

ప్రస్తుతం 13 లక్షల టన్నుల బొగ్గు నిల్వలు

జేవీఆర్ ఓపెన్ కాస్టు, కిష్టారం ఓపెన్ కాస్టులలో ఉత్పత్తి అయిన బొగ్గు రైల్వే మార్గంలో రవాణా జరుతున్నప్పటికీ రెండు ఓపెన్ కాస్టుల్లో 13లక్షల టన్నుల బొగ్గు నిల్వలు పేరుకున్నాయి. సాధారణంగా వర్షాకాలంలో బొగ్గు ఉత్పత్తికి అంతరాయం ఉంటుంది. దీనికి దృష్టిలో ఉంచుకొని వేసవిలోనే అత్యధికంగా బొగ్గు ఉత్పత్తి చేస్తారు. బొగ్గు ప్రభుత్వ రంగ విద్యుత్ ఉత్పత్తి సంస్థలకు సరఫరా చేయటంతో పాటు ప్రతి ఏటా సిమెంట్, ఎరువుల ఫ్యాక్టరీలతో పాటు, పేపర్ మిల్లులు, పాలు కంపెనీలకు బొగ్గు అవసరం ఉండటంతో వారికి కూడా స్థానిక బొగ్గు విక్రయిస్తారు. గత ఏడాది వరకూ ప్రైవేటు ఫ్యాక్టరీలు సగటున రోజుకు పది వేల టన్నుల బొగ్గు కొని తరలించేవి, ఈ ఏడాది మార్చి నుంచి సదరు కంపెనీలు బొగ్గు ఇక్కడ తీసుకోకపోవటంతో స్థానిక ఓసీలలో 13లక్షల టన్నుల బొగ్గు నిల్వలు ఉన్నాయి. నిల్వ ఉన్న బొగ్గు ఇక్కడ నుంచి రవాణా చేయాల్సి ఉంది. ఈ క్రమంలో ఓసీల్లో నిల్వ ఉన్న 13లక్షల టన్నుల బొగ్గును రోడ్డు మార్గం ద్వారా రుద్రంపూర్ కోల్ హ్యాడ్లింగ్ ప్లాంట్ (ఆర్‌సీహెచ్‌పీ) కి రవాణా చేయాలని అధికారులు నిర్ణయించి టెండర్లు పిలిచారు. ప్రైవేటు కంపెనీలకు నాణ్యమైన బొగ్గు ఇవ్వకపోటం వల్లనే సదరు కంపెనీలు బొగ్గు కొనుగోలుకు రవాటం లేదని స్థానిక లారీ యజమానులు ఆరోపిస్తున్నారు. దీనివల్ల తమకు లోడింగ్ అవకాశాలు తగ్గాయని ఆ దోళన చేస్తూండగా నాణ్యమైన బొగ్గు ఇస్తున్నామని, ప్రైవేటు కం పెనీలు కూడా నాణ్యతపై తమను సంప్రదించలేదని అధికారులు చెపుతున్నారు.

కాలుష్యం, ప్రమాదాలు తప్పవంటూ స్థానికుల అసంతృప్తి

సత్తుపల్లిలో సింగరేణి సంస్థ ఓపెన్ కాస్టులు ప్రారంభమైన 2005 నుంచి 2021 వరకూ రోడ్డు మార్గం ద్వారానే బొగ్గు కొత్తగూడెం రవాణా చేశారు. లారీల్లో రోడ్డు మార్గంలో బొగ్గు రవాణా వాతావరణ కాలుష్యానికి కారణమవుతుందని కేంద్ర ప్రభుత్వం హెచ్చరించింది. రోడ్డు మార్గంలో బొగ్గు రవాణా తగ్గించి రైల్వే మార్గంలో రవాణా చేయాలని ఆదేశించింది. ప్రభుత్వ ఆదేశాలతో పాటు రోడ్డు మార్గంలో లారీలు, టిప్పర్ల ద్వారా బొగ్గు రవాణా సమయంలో సత్తుపల్లి - కొత్తగూడెం మధ్య అనేక ప్రమాదాలు జరిగి పెద్ద సంఖ్యలో ప్రాణ నష్టం కూడా జరిగిన సంఘటనలు ఉన్నాయి. లారీల్లో లక్షలాది టన్నుల బొగ్గు రవాణా కారణంగా వాతావరణ కాలుష్యం, ప్రమాదాలు జరిగే అవకాశం ఉండటంతో స్థానికులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. రోడ్డు మార్గం ద్వారా బొగ్గు రవాణా నిలిపివేయాలని కేంద్ర పర్యావరణ శాఖ హెచ్చరించినా విద్యుత్ ఉత్పత్తి సంస్థలకు బొగ్గు సరఫరా డిమాండ్ మేరకు అందజేయాల్సి ఉందని దీనిని దృష్టిలో ఉంచుకొని సత్తుపల్లిలో ఉన్న బొగ్గు రవాణాకు టెండర్లు పిలిచినట్లు అధికారులు చెపుతున్నారు. మరో పక్క స్థానిక లారీ యజమానుల ఆందోళన ఫలితంగా ఆర్‌సీహెచ్‌పికి రోడ్డు మార్గం ద్వారా బొగ్గురవాణా తాత్కాలికంగా అధికారులు వాయిదా వేశారు.

6 వరకు మార్కెట్‌కు 'వేసవి' సెలవులు

ఖమ్మంమార్కెట్, మే 22: నగరంలోని వ్యవసాయ మార్కెట్‌కు జూన్ 6 వరకు వేసవి సెలవులు కొనసాగుతాయని మార్కెట్ సెక్రెటరీ ప్రవీణ్‌కుమార్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ప్రస్తుతం ఎండల తీవ్రత పెరగడంతో మిర్చి యార్డులలో పనులు చేయడం వ్యాపారులు, కార్మికులకు కష్టతరంగా మారి వడదెబ్బకు గురౌతున్న నేపథ్యంలో ఛాంబర్ ఆఫ్ కామర్స్ ప్రతినిధులు, కార్మిక సంఘాల కోరిక మేరకు ప్రతి సంవత్సరం వలే ఈ ఏడాది కూడా వేసవి సెలవులు ప్రకటించినట్లు ఆయన తెలిపారు. మార్కెట్ తిరిగి జూన్ 7న శుక్రవారం నుంచి పునఃప్రారంభమవుతుందని అప్పట్నుంచి పత్తి, అపరాలు, మిర్చి యార్డులలో యధావిధిగా క్రయవిక్రయాలు ఉంటాయని ఆయన తెలిపారు. రైతులు సెలవులు విషయాన్ని గ్రహించాలని కోరారు.

ఐఎన్‌టీయూసీ రాష్ట్ర కన్వీనర్‌గా తలారి


నియామక పత్రాన్ని అందుకుంటున్న రాములు

కొణిజర్ల ,మే 22: రాష్ట్ర మిషన్ భగీరథ ఆర్‌డబ్ల్యూఎస్ కార్మిక విభాగం ఐఎన్‌టీయుసీ రాష్ట్ర కన్వీనర్‌గా కొణిజర్లకు చెందిన తలారి రాములు నియామకపత్రాన్ని ఐఎన్‌టీయుసీ జాతీయ అధ్యక్షులు జీవన్‌రెడ్డి ఆదేశానుసారం రాష్ట్ర కార్యదర్శిఖమ్మం జిల్లా అధ్యక్షులు కొత్త సీతారాములు చేతులు మీదగా పత్రాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా రాములు బుధవారం మాట్లాడుతూ తనపై నమ్మకంతో రాష్ట్ర పదవిని అందించినందుకు సంతోషంగా ఉందన్నారు. కార్మికుల సమస్యలపై జిల్లా, రాష్ట్ర నాయకులతో కలిసి పోరాడి పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు. తనకు పదవి ఇచ్చినందుకు జిల్లా, రాష్ట్ర, జాతీయ నాయకత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.

'జనంకోసం జనరల్ బోగీలు కేటాయించాలి'



ప్రధానికి రాసిన ఉత్తరాలతో వనజీవి రామయ్య, పరికిపండ్ల అశోక్ తదితరులు

ఖమ్మం రూరల్, మే 22: జనం కోసం జనరల్ బోగీలు కేటాయించాలని ప్రధానమంత్రి కార్యాలయానికి గాందేయ మార్గంలో కోటి ఉత్తరాల విన్నపం కార్యక్రమాన్ని చేపట్టినట్లు ఐదు సాధారణ బోగీల సాధన సమితి కన్వీనర్ డాక్టర్ పరికిపండ్ల అశోక్ తెలిపారు. మండల పరిదిలోని రెడ్డిపల్లిలోని పద్మశ్రీ అవార్డు గ్రహీత వనజీవి రామయ్య ఇంటివద్ద బుధవారం రామయ్యతో ప్రధాని కార్యాలయానికి ఉత్తరాన్ని రాయించారు. అశోక్ మాట్లాడుతు ప్రతి రోజు దేశవ్యాప్తంగా సుమారు 60 కోట్ల మంది రైళ్ల ద్వారా ప్రయాణిస్తున్నట్లు తెలుస్తుందన్నారు. ఈ ప్రయాణంలో జనరల్ బోగీల్లో ప్రయాణించే సామాన్య ప్రజల పరిస్థితి దారుణంగా ఉంటుందన్నారు. సీట్లు తక్కువగా ఉండటం, బోగీల్లో స్థలం లేకపోవడంతో అనేక ప్రమాదాలు జరిగిన ఘటనలు ఉన్నాయన్నారు. కేంద్ర ప్రభుత్వం, ప్రధాని మోదీ విన్నపాలను అర్థం చేసుకుని జనంకోసం జనరల్ బోగీలు కేటాయించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వెంకట్రామయ్య సైదులు, ఉమేష్, శ్రీనివాస్, వేణు తదితరులు పాల్గొన్నారు.


ప్రధానికి ఉత్తరం రాస్తున్న వనజీవి

మావోయిస్టులకు సహకరిస్తే కఠిన చర్యలు

- భద్రాద్రి ఎస్పీ రోహిత్‌రాజ్
- తునికాకు వ్యాపారులు, కాంట్రాక్టర్లతో సమావేశం


వ్యాపారులు, కాంట్రాక్టర్లతో మాట్లాడుతున్న ఎస్పీ

కొత్తగూడెం, మే 21 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ - చత్తీస్‌గడ్ సరిహద్దు మావోయిస్టు ప్రభావిత ప్రాంతాలకు సంబంధించిన తునికాకు వ్యాపారులు, కాంట్రాక్టర్లతో బుధవారం కొత్తగూడెం ఎస్పీ రోహిత్‌రాజ్ బుధవారం ఎస్పీ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాలులో సమావేశం నిర్వహించారు. ఎస్పీ మాట్లాడుతూ నిషేదిత సీపీఐ మావోయిస్టుల వల్ల తునికాకు వ్యాపారులకు ఎదురవుతున్న సమస్యలపై అడిగి తెలుసుకున్నారు. మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల్లో తునికాకు సేకరణపై ఆధారపడి జీవిస్తున్న ఆదివాసీ ప్రజలకు ఎలాంటి నష్టం కలగకుండ చూడాలని వారికి సూచించారు. ఏజెన్సీ ప్రాంతాల్లో తునికాకు సేకరణ గురించి తిరిగే వ్యాపారులు తగిన జాగ్రత్తలు పాటించాలని తెలిపారు. నిషేదిత సీపీఐ మావోయిస్టుల గురించి ఎలాంటి సమాచారం తెలిసిన వెంటనే పోలీస్ వారికి సమాచారం అందించాలని కోరారు. పరోక్షంగానైన ప్రత్యక్షంగానైన నిషేదిత సీపీఐ మావోయిస్టు పార్టీ వారికి సహకారం అందించినట్లు తెలిస్తే వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఎస్పీ హెచ్చరించారు. ఆదివాసీ ప్రజలకు నష్టం వాటిళ్లకుండ వారి సంక్షేమం కొరకు జిల్లా పోలీస్‌శాఖ ఎల్ల వేళలా కృషి చేస్తుందన్నారు.

కాంగ్రెస్‌తోనే యువతకు ఉపాధి అవకాశాలు

- రాష్ట్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్ రియాజ్


మాట్లాడుతున్న రియాజ్

కొత్తగూడెం టౌన్, మే 21: నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించే సత్తా కాంగ్రెస్ పార్టీకే ఉందని ఆ పార్టీ అధికార ప్రతినిధి, రాష్ట్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్ డాక్టర్ ఎండి. రియాజ్ తెలిపారు. ఎన్నికల మ్యానిఫెస్టోను అమలు చేయడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి శ్రమిస్తున్నారని ప్రకటించారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి తీన్మార్ మల్లన్న విజయాన్ని కాంక్షిస్తూ సింగరేణి ప్రధాన కార్యాలయంతోపాటు మైన్స్ డిపార్టుమెంట్ల వద్ద ఎన్నికల ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించారు. బుధవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో అన్నివర్గాల సంక్షేమానికి ప్రభుత్వం పని చేస్తుందని తెలిపారు. పని చేసే ప్రభుత్వానికి మరింత బలాన్ని చేకూర్చేందుకు విద్యావంతులు కాంగ్రెస్‌కు మద్దతుగా నిలవాలని కోరారు. 2లక్షల ఉద్యోగాలను భర్తీ చేయడంతో పాటు రైతురుణమాఫీ పథకాన్నిత్వరలోనే అమలు చేస్తామని ప్రకటించారు. ప్రభుత్వ రంగ సంస్థలను పరిరక్షించే సత్తా కాంగ్రెస్ పార్టీకే ఉందన్నారు. గత పది సంవత్సరాలుగా చట్టసభల్లో చర్చించకుండ ఆర్డినెన్స్ ద్వారా పాలన సాగించారని ఆరోపించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజాపాలన కొనసాగుతుందని తెలిపారు. భద్రాద్రి జిల్లాలో గ్రంథాలయాల అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు పూకంటి గోపాలరావు, నాయకులు నాగ సీతారాములు, తూముచౌదరి, ఆకునూరి కనకరాజు, రమేష్ సతీష్ , శ్రీను, సుప్రియ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ షాక్‌తో రెండు పాడిగేదెల మృతి

లక్ష్మీదేవిపల్లి, మే 21: విద్యుత్ షాక్ తగిలి రెండు పాడిగేదెలు మృతి చెందిన సంఘటన బుధవారం లక్ష్మీదేవిపల్లి మండలంలో చోటుచేసుకుంది. మండల పరిధిలోని తెలగరామవరం గ్రామంలో మేత మేసేందుకు పొలాల్లోకి వెళ్లిన గేదెలకు అక్కడ ఉన్న విద్యుత్‌స్తంభాలకు అమర్చిన ఎర్త్‌వైర్లు తగలడంతో గేదెలు అక్కడికక్కడే మృత్యువాతపడ్డాయి. వీటిలో ఒక గేదె హేమచంద్రాపురం గ్రామానికి చెందిన బొల్ల చంద్రారెడ్డి గేదె కాగా మరోక గేదె యజమాని ఎవరో అనేది తెలియాల్సి ఉంది. విద్యుత్‌శాఖాధికారులు పొలాల్లో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు స్తంభాలు అమర్చి వాటికి భద్రత చర్యలు చేపట్టకపోవడంతో ఇటువంటి సంఘటనలు చోటుచేసుకుంటున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. విద్యుత్ తీగలు మూగజీవాల పాలిట మృత్యుపాశాలుగా మారడంపై విద్యుత్ శాఖాధికారుల నిర్లక్ష్యం స్పష్టమవుతుందని, జీవనాధారానికి మూలమైన గేదెలు మృతి చెందడంతో యజమానులు, రైతులు ఆర్థికంగా నష్టలబారిన పడుతున్నట్లు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

పోస్టల్ బ్యాలెట్లు వినియోగించుకోవాలి

- జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ప్రియాంక



కొత్తగూడెం, మే 21 (ఆంధ్రజ్యోతి): వరంగల్ - ఖమ్మం - నల్గొండ శాసన మండలి పట్టభద్రుల ఉప ఎన్నిక నిర్వహణ లో భాగంగా విధులు నిర్వహిస్తున్నటువంటి ఎన్నికల సిబ్బం దికి సంఘం కల్పించిన పోస్టల్ బ్యాలెట్ ద్వారా తమకు ఓటు హక్కును సద్వినియోగపర్చుకోవాలని జిల్లా ఎన్నికల అధికారి , కలెక్టర్ ప్రియాంక బుధవారం తెలిపారు. కలెక్టర్ మాట్లాడుతూ ఐడీఓసీ కార్యాలయ రూం నెంబరు ఎఫ్ 7లో ఓటరు ఫెసిలిటేషన్ సెంటరు ఏర్పాటు చేశామని ఈ ఓటరు ఫెసిలిటేషన్ సెంటరులో ఉద్యోగస్తులు తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు అన్ని ఏర్పాట్లు చేశామని, ఉదయం 10గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు అర్హులైన అందరు తమ ఓటు హక్కును పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఉపయోగించుకోవాలని తెలిపారు. జిల్లాలో ఇప్పటి వరకు పోస్టల్ బ్యాలెట్ ద్వారా 70మంది తమ ఓటు హక్కును సద్వినియోగం చేసుకున్నారని తెలిపారు. ఈ నెల 24 వరకు ఈ ఓటరు ఫెసిలిటేషన్ సెంటరు అర్హులైన అందరు తమ ఓటు హక్కును పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఉపయోగించుకోవాల ని కలెక్టర్ తెలిపారు.

9న ఆలిండియా ట్రైబల్‌ఫోరం రాష్ట్ర సదస్సు

- జాతీయ కన్వీనర్ ముక్తి సత్యం జాతీయ నాయకుడు నాగేశ్వరరావు



మాట్లాడుతున్న ఆదివాసీ జాతీయ కన్వీనర్ ముక్తి సత్యం

ఇల్లెందుటౌన్, మే 21: ఆదివాసీ సమస్యల పరిష్కారం కోసం వచ్చే నెల 9న కొత్తగూడెంలో ఆలిండియా ట్రైబల్ ఫోరం రాష్ట్ర సదస్సు నిర్వహిస్తున్నట్లు జాతీయ కన్వీనర్ ముక్తి సత్యం జాతీయ నాయకుడు సువర్ణపాక నాగేశ్వరరావు తెలిపారు. బుధవారం ఇల్లెందులో జరిగిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడుతూ ఆదివాసీలు దోపిడి అణిచివేత పీడతలకు గురై ఆర్థిక, రాజకీయ, సామాజిక రంగాల్లో వెనుకబడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు. ఏజెన్సీలోని ఆదివాసీ చట్టాలను రద్దు చేసి నూతన అటవీ సంరక్షణ నియమాలు తీసుకొచ్చి ఖనిజ సంపదను కార్పోరేట్ కంపెనీలకు దోచిపెట్టేందుకు కుట్రలు చేస్తున్నారని విమర్శించారు. ప్రభుత్వం చేపట్టిన భారీ ప్రాజెక్టుల మూ లంగా లక్షలాది మంది ఆదివాసీలు నిర్వాసితులు అవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. జూన్ 9న కొత్తగూడెంలో జరిగే రాష్ట్ర సదస్సును విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో ఆలిండియాట్రైబల్ ఫోరం నాయకులు ఈసం కృష్ణ, చింతా ఉదయ్ తదితరులు పాల్గొన్నారు.

పీడీఎస్‌యూ నేతపై పూసపల్లి కుట్రకేసు


నిరసన వ్యక్తం చేస్తున్న పీడీఎస్‌యూ నాయకులు

ఇల్లెందుటౌన్, మే 21: న్యూడెమోక్రసీ అనుబంధ పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు మొగిలి వెంకటరెడ్డిపై ఇల్లెందు పోలీసులు పూసపల్లి కుట్రకేసు నమోదు చేశారు. గత ఫిబ్రవరిలో న్యూడెమోక్రసీ రాష్ట్ర కార్యదర్శి అశోక్‌ను అరెస్టు చేసిన ఇల్లెందు పోలీసులు అయనతోపాటు మరికొంత నాయకులపై పూసపల్లి కుట్రకేసును నమోదు చేశారు. అదేకేసులో తాజాగా వరంగల్ జిల్లాకు చెందిన పీడీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు మొగిలి వెంకటరెడ్డిపై కుట్ర కేసును నమోదు చేశారు. ఈ కుట్రకేసులను నిరసిస్తూ బుధవారం ఇల్లెందు జీకేకాలనీలో గల అంబేద్కర్ విగ్రహం వద్ద పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. పీడీఎస్‌యూ జిల్లా నాయకులు గణేష్ మాట్లాడుతూ అక్రమంగా విద్యార్థి సంఘంనేతపై కుట్రకేసు నమోదు చేయడం అప్రజాస్వామికమన్నారు. తక్షణమే కేసును ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు సిద్ధు, నరేష్, పార్థు, సాయి, వంశీ, శశివర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

17 కేజీల గంజాయి పట్టివేత


గంజాయితో పట్టుబడిన సత్యబాబు

బూర్గంపాడు/దమ్మపేట, మే 22: వ్యవసాయంలో నష్టాలు రావడంతో సులభంగా డబ్బు సంపాదించాలని గంజాయి రవాణా చేస్తూ ఓ వ్యక్తి పోలీసులకు చిక్కాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... ఏపీలోని అల్లూరి సీతారామరాజు జిల్లా చింతూరు మండలం అల్లిగూడెం గ్రామానికి చెందిన తునికి లక్ష్మణ్ వ్యవసాయం చేసుకుంటూ జీవనం కొనసాగించేవాడు. వ్యవసాయంలో నష్టం రావడంతో లక్ష్మణ్ తక్కువ సమయంలో ఎక్కువ డబ్బు సంపాదించాలని నిర్ణయించుకున్నాడు. దీంతో గంజాయి వ్యాపారానికి సిద్ధమయ్యా డు. మంగళవారం రాత్రి భద్రాద్రి జిల్లా సారపాక శివారులోని పుష్కరవనం వద్ద పోలీసులు వాహన తనిఖీ చేపట్టారు. ఈ క్రమంలో బైక్‌పై వస్తున్న లక్ష్మణ్‌ను ఆపి తనిఖీ చేయగా గంజాయి బయటపడింది. నిందితుడిని అదుపులోకి తీసుకుని విచారించగా సారపాకకు చెందిన సురేష్ అనే వ్యక్తికి గంజాయిని విక్రయించేందుకు తీసుకెళుతున్నట్లు తెలిపాడు. నింది తుడి వద్ద 15కేజీల గంజాయి, సెల్‌ఫోన్, బైక్ స్వాధీనం చేసుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. నిందితుడిపై కేసు నమో దు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. కాగా గంజా యి వ్యాపారి సురేష్ పరారీలో ఉన్నట్లు తెలుస్తోంది.

రెండు కేజీల గంజాయి పట్టివేత

దమ్మపేట: రెండు కేజీల గంజాయిని తరలిస్తున్న వ్యక్తిని దమ్మపేట పోలీసులు బుధవారం సాయంత్రం అదుపులోకి తీసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాలు.. గోపాలపురం గ్రామ సమీపంలో రహదారిపై పోలీసులు, నార్కోటిక్ అధికారులు సమచారం మేరకు తనీఖీలు నిర్వహిస్తున్నారు. ఈక్రమంలో చిల్లగుంపు గ్రామానికి చెందిన కొయ్యల సత్యబాబు అనే వ్యకి ద్విచక్రవాహనంపై రెండు కేజీలపైగా గంజాయిని తరలిస్తుండగా పోలీసులు పట్టుకున్నారు. నిందితుడును అదుపులోకి తీసుకొని దమ్మపేట పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ద్విచక్రవాహనం, గంజాయిని పోలీసులు స్వాదీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ సాయికిషోర్‌రెడ్డి తెలిపారు.

మద్యం అక్రమ తరలింపు కేసులో ఆరు నెలల జైలు

కొత్తగూడెం లీగల్, మే 21: వ్యక్తికి ఆరు నెలల జైలు శిక్ష విధిస్తూ కొత్తగూడెం ప్రిన్సిపల్ జ్యూడిషియల్ ఫస్ట్ క్లాస్ న్యాయాధికారి బత్తుల రామారావు బుధవారం తీర్పు చెప్పారు. అప్పటి ప్రొబిషన్ అండ్ ఎక్సైజ్ సబ్ ఇన్‌స్పెక్టర్ సీహెచ్ నాగేశ్వరరావు కథనం ప్రకారం 2019 పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా దమ్మపేట సెంటరులో 2019 ఏప్రిల్ 9న వాహన తనిఖీ చేస్తుండగా స్కూటర్‌పై వస్తున్న వ్యక్తిని ఆపి స్కూటర్‌ను పరిశీలించగా ఇంపీరియర్ బ్లూ రాయల్ గ్రీన్ విస్కీ బాటిల్స్, మధుర సిరాజ్ వైన్ మొత్తం 147 క్వార్టర్ బాటిళ్లను కొత్తగూడెం కూలీలైన్‌కు చెందిన కుసుమ శ్రావణ్ అక్రమ రవాణా చేస్తుండగా పంచనామ ద్వారా స్వాధీన పర్చుకుని కేసు నమోదు చేసుకుని దర్యాప్తు అనంతరం కోర్టులో చార్జీషిట్ దాఖలు చేశారు. ముగ్గురు సాక్షులను విచారించిన అనంతరం కోర్టులో నేరం రుజురు అయినందున కుసుమ శ్రావణ్‌కు ఆరు నెలల జైలు శిక్ష, రూ.2వేల జరిమాన విధిస్తూ తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ ఏపీపీ ఎస్. లావణ్య నిర్వహించారు. ఇప్పటి ప్రొబిషన్ అండ్ ఎక్సైజ్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఎం. ప్రసాద్ పాల్వంచ, కోర్టు డ్యూటి ఆఫీసర్ కోర్టు ఎక్సైజ్ కానిస్టేబుల్ వై. రామకృష్ణలు సహకరించారు.

మృతదేహం తరలిస్తున్న వాహనం కాల్వలో పల్టీ

- ఏడుగురికి గాయాలు

చర్ల, మే 22: మృతదేహాన్ని తరలిస్తున్న వాహనం తాలిపేరు కాల్వలోకి పల్టీ కొట్టిన ఘటన చర్ల మండలం దానావాయి గ్రామ శివారున బుధవారం ఉదయం చోటు చేసుకుంది. చత్తీస్‌గడ్ చెందిన పొదియా (45)అనే వ్యక్తి బుధవారం భూరుగు పాడు గ్రామంలో మృతి చెందాడు. దీంతో కుటుంబ సభ్యులు వాహనంలో మృతదేహాన్ని చత్తీస్‌గడ్ రాష్ట్రం దుబ్బతోట గ్రామానికి తరలిస్తున్నారు. వాహనంలో మరో 7గురు కుటుంబ సభ్యులు కూడా ఉన్నారు. ఇదే క్రమంలో దానవాయిపేట గ్రామశివారులోని భారీ మలుపు వద్ద వాహనం అదుపుతప్పి పల్టీ కొడుతూ వాగులోకి దూసుకు పోయింది. వాహనంలో ఉన్న మడకం లక్క, దని, దేవి, భీమమ్మ, నందే, హిడ్మా, గంగోత్రి గాయ పడ్డారు, ప్రమాదాన్ని గుర్తించిన స్థానికులు వీరిని వెంటనే సత్యనారాయణ పురం వైద్యశాలకు తరలించి ప్రధమ చికిత్స అందించారు.


కాలువలో పడిన వాహనం

మణుగూరు ఏరియాలో జీఎం ఎస్టేట్ పర్యటన

- ఓసీ విస్తరణ పనులపై అధికారులతో సమీక్ష

మణుగూరుటౌన్, మే 22: సింగరేణి కాలరీస్ మణుగూరు ఏరియాలోని మణుగూరు ఓసీ గని విస్తరణలో బాగంగా బుదవారం సింగరేణి జీఎం ఎస్టేట్ బీ వెంకయ్య ఆధ్వర్యంలోని బృందం ఏరియాలో పర్యటించింది. ఇందులో బాగంగా మణుగూరు ఓసీ విస్తరణకు కావాల్సిన 58.51 హెక్టార్ల అటవీ భూమికి సంబంధి గని ప్రాజెక్ట్ అధికారి శ్రీనివాసచారితో చర్చించారు. గని వ్యూ పాయింట్ నుంచి గనిలో జరగుతున్న బొగ్గు ఉత్పత్తి ప్రక్రియలను పరిశీలించారు. ఎంఎన్‌జీఓసీ పునరావాస గ్రామమైన కొత్త కొండాపురం ఆర్‌అండ్‌ఆర్ కాలనీని సందర్శించి సింగరేణి ఏర్పాటు చేసిన రోడ్లు, డ్రైనేజిలు, ఇతర సౌకర్యాలను పరిశీలించారు. అనంతరం ఏరియా జీఎం దుర్గం రామచందర్‌తో సమావేశమయ్యారు. డైరెక్టర్ ఆఫ్ మైన్స్ అండ్ జీయాలజీ నుంచి మణుగూరు ఏరియాలో అన్ని ఓసీలకు ఒకటే లీజు తీసుకునేందుకు గల అవకాశాలపై చర్చించారు. కార్యక్రమంలో ఎస్ఓటు జీఎం శ్యాంసుందర్, అధికారులు శ్రీనివాసచారి, సురేష్, శ్రీనివాస్, బాబుల్‌రాజ్, శైలేందర్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



విస్తరణకు సంబంధించిన మ్యాప్‌ను పరిశీలిస్తున్న జీఎం ఎస్టేట్ వెంకయ్య

అనుమానాస్పదస్థితిలో వృద్ధురాలి మృతి

- దర్యాప్తు చేపట్టిన పోలీసులు


విచారణ నిర్వహిస్తున్న పోలీసులు

కొత్తగూడెం పోస్టాఫీస్ సెంటర్, మే 22: కొత్తగూడెం పట్టణంలో ఓ వృద్ధురాలు అనుమానస్పద స్థితిలో మృతి చెందిన సంఘటన వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో బుధవారం తెల్లవారుజామున చోటు చేసుకుంది. వన్‌టౌన్ సీఐ కరుణాకర్ తెలిపిన వివరాలు.. పట్టణంలోని ప్యూన్‌బస్తీలో దేవరాజ్ ప్రమీల(65) నివసిస్తుంది. ఈమె భర్త ప్రభాకర్ ఇటీవలే మృతి చెందగా వాటి కార్యక్రమాలు కుటుంబ సభ్యులు పూర్తి చేశారు. మృతురాలికి ఒక కుమార్తె మృతి చెందగా, ఇద్దరు కుమారులు హైదరాబాద్‌లో ఉంటున్నారు. వారిలో పెద్ద కుమారుడు మహేందర్ కేంద్ర ప్రభుత్వ ఉద్యోగి కాగా, చిన్న కుమారుడు వినోద్ ప్రవేటు ఉద్యోగం చేసుకుంటున్నారు. ప్రతి రోజు మాదిరిగానే మంగళవారం రాత్రి 11 గంటల వరకు ఇంటి చుట్టూ పక్కన వాళ్లతో మాట్లాడిన ప్రమీల రాత్రి పడుకుంది. రోజు వారి ఉదయం నాలుగు గంటలకు లేచి ఇంటి పనులు చేసుకునే ప్రమీలకు హైదరాబాద్ నుంచి కుమారుడు ఉదయం ఐదున్నర గంటలకు ఫోన్ చేస్తే లేపక పోవడంతో పక్కనే ఉన్న తన స్నేహితుడుకి ఫోన్ చేశాడు. ఆ స్నేహితుడు ఇంటికి వెళ్లి తలుపు తట్టి చూడగా ఇంట్లో మృతురాలు పడిపోయి ఉందని తెలిపాడు. మృతురాలి పక్కనే మందులకు సంబంధించిన డబ్బా పడిపోయి ఉండడాన్ని గమనించి స్థానికులు 108కి సమాచారాన్ని అందజేశారు. 108 సిబ్బంది ప్రమీలను పరిశీలించిన మృతిచెందినట్టు తెలిపారు. స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. కొత్తగూడెం వన్‌టౌన్ పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని వివరాలను సేకరించారు. క్లూస్ టీం, డాగ్ స్క్వాడ్‌ను పిలిపించి పోలీసులు వివరాలు సేకరించారు. మృతదేహాన్ని కొత్తగూడెం సర్వజన ఆసుపత్రికి పోస్ట్ మార్టం నిమిత్తం తరలించారు. కుమారుడు వినోద్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు తన తల్లి మృతురాలు ప్రమీల ఒంటిపై బంగారు ఆభరణాలు కనిపించడం లేదని పేర్కొన్నారు. అనుమానస్పద స్థితిలో మృతి చెందినట్లు వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు.



పంపిణీకి సిద్ధంగా జీలుగు విత్తనాలు

కల్లూరు/ఖమ్మంరూరల్, మే 22: మండలంలో ప్రాథమిక సహకార సంఘాల్లో సబ్సిడీ జీలుగు విత్తనాలు సిద్ధంగా ఉన్నాయని ఏవో రూపా బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని కల్లూరు, చెన్నూరు, చిన్నకోరుకొండి, సొసైటీల పరిధిలో ఈ విత్తనాలు సబ్సిడీపై రైతులకు అందిస్తామని, రైతులు పట్టాదారు పాస్‌పుస్తకాల జిరాక్స్ తీసుకోని ఆయా గ్రామాల పరిధిలో గల రైతు వేదికల వద్దకు తరలి రావాలని ఏవో ఆ ప్రకటనలో కోరారు.

ఖమ్మంరూరల్: మండల పరిధిలోని ఏదులాపురం సహకార సంఘంలో జీలుగులు, జనుములు అందుబాటులో ఉన్నాయని సీఈవో అలీ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. రైతులు గ్రామాల్లో రైతువేదిక వద్ద ఉన్న ఏఈవోలకు పట్టాపాసుపుస్తకాలు చూపించి కూపన్లు రాయించుకోవాలన్నారు. వాటిని తీసుకుని నాయుడుపేటలోని గోదాము వద జీలుగులు, జనుములు ఇస్తారని చెప్పారు.

పాఠశాలల పునఃప్రారంభం నాటికి
ఏకరూప దుస్తులు అందించాలి

▸ కలెక్టర్ గౌతమ్

ఖమ్మంరూరల్, మే22: పాఠశాలల పునఃప్రారంభం నాటికి ఏకరూప దుస్తులు అందించాలని కలెక్టర్ గౌతమ్ అధికారులకు సూచించారు. మండల పరిధిలోని నాయుడు పేటలోని మహిళాశక్తి కుట్టుకేంద్రాన్ని బుధవారం కలెక్టర్ సందర్శించారు. జిల్లావ్యాప్తంగా అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో 115990 మంది బాలురు, 132857 మంది బాలికలు ఉన్నట్లు తెలిపారు. 1185 మంది స్వయం సహాయక సంఘాల సభ్యులను గుర్తించి ఏకరూప దుస్తుల తయారీకి చర్యలు చేపట్టినట్లు తెలిపారు. విద్యార్థుల వారీగా కొలతలు తీసుకుని, మహిళా శక్తికుట్టు కేంద్రాలకు తయారీకి అప్పగించామన్నారు. జలగంనగర్ కుట్టు కేంద్రంలో 19కుట్టుమిషన్లు ఉండగా, కటింగ్ మిషన్ కాజా మిషన్, బటన్ మిషన్‌లు సమకకూర్చినట్లు ఆయన తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల పిల్లలకు ఏకరూప దుస్తులు అందడంతో పాటు స్వయం సహాయక సంఘాల వారికి ఉపాధి కల్పన జరుగుతుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ ఎస్.కుమార్, ఏపీఎం ఎం.శ్రీనివాస్‌రావు, సీసీ బి.మోహన్, కే.శారద పాల్గొన్నారు..

నెలాఖరులోగా ధరణి సమస్యలు పరిష్కరించాలి

కూసుమంచి: ధరణి పెండింగ్ దరఖాస్తులను ఈనెలా ఖరులోగా పరిష్కరించాలని కలెక్టర్ వి.పి.గౌతమ్ ఆదేశించారు. బుధవారం కూసుమంచి తహసీల్దార్ కార్యాలయాన్ని తనిఖీ చేశారు. మండలంలో టీఎం 33, మ్యూటేషన్ తదితర దరఖాస్తులు కలుపుకుని ధరణిలో 380 దరఖాస్తులు, 15 రిజిస్ట్రేషన్ స్లాట్‌లు పెండింగ్‌లో ఉన్నాయని అవన్నీ త్వరితగతిన పరిష్కరించాలని అన్నారు.

ధాన్యం కొనుగోళ్లపై కలెక్టర్ ఆరా

మండలంలో ధాన్యం కొనుగోళ్లపై కలెక్టర్ ఆరా తీశారు. కల్లూరిగూడెం సొసైటీని సందర్శించారు. అక్కడ రైతులతో మాట్లాడారు. దాదాపు అందరూ సన్నాలే పండించామని, సన్నాలకు మంచి ధర లభించిందని కలెక్టర్‌కు తెలిపారు. లైసెన్స్ ట్రేడర్లు, మిల్లర్లు క్వింటాల్‌కు రూ.2400 నుంచి 2600 వరకు ఇచ్చి కొనుగోలు చేశారని రైతులు కలెక్టర్‌తో అన్నారు. ఎరువుల విషయంపై ప్రశ్నించగా పెరికశింగారంలో ఎరువుల పాయింట్ ఉన్నట్లు తెలిపారు. కలెక్టర్ వెంట జిల్లా పౌరసరఫరాల అధికారి చందన్‌కుమార్, జిల్లా పౌరసరఫరాల మేనేజర్ శ్రీలత, కూసుమంచి తహసీల్దార్ సురేష్‌కుమార్ ఉన్నారు.



మహిళాశక్తి కుట్టు కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్

నరసింహ స్తంభోద్భవం.. పులకించిన భక్తజనం

ఖమ్మంసాంస్కృతికం,మే22: శ్రీలక్ష్మీనరసింహస్వామి స్తంభోద్భవ దర్శనం భక్తులను పులకింపచేసింది.. స్తంభాలను చీల్చుకొని నరసింహస్వామి భక్తులకు దర్శనమించిన దృశ్యం భక్తులను పులకింపజేసింది. ఖమ్మంలోని శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవాలయ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం ఈ కార్యక్రమం నిర్వహించారు. ఖమ్మం నగరానికి స్తంభాద్రి అన్న పేరు రూపాంతరం చెంది ఖమ్మంగా స్థిరపడటానికి కారణం.. ఈ దేవాలయంలోని స్వామి వారి అస్తిత్వమే కారణమని చెపుతారు. నాడు ప్రహ్లాద భక్తికి మెచ్చిన నరసింహస్వామి స్థంభాన్ని బద్దలుకొట్టుకొని వచ్చి దైవం అన్ని చోట్లా ఉంటాడని నిరూపించినట్లు పురాణ గాథల్లో చదివాం.. ఆ దృశ్యాన్ని పునరావృతం చేస్తూ నరసింహస్వామి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. స్వామి వారు స్వయంగా స్తంభాన్ని చీల్చుకొని వస్తున్నట్లుగా ఏర్పాట్లు చేశారు. దేవాలయంలోని అద్దాల మండపంలో స్వామి వారి విగ్రహం ఏర్పాట్లు చేసి అందులో ప్రత్యేక లైట్లు ఏర్పాటు చేశారు. అద్దాల మండపం ముందు స్థంభాన్ని చీల్చినట్లుగా సెట్ వేశారు. అంతకుముందు ఉత్సవాల్లో భాగంగా స్వామి వారికి ప్రత్యేక పూజలు పానాకాభిషేకం, బాలబోగ నివేదన, సుదర్శన యాగం నిర్వహించారు.



స్తంభోద్భవ దర్శనం ఇస్తున్న లక్ష్మీనరసింహస్వామి

అంతర్జాతీయ జీవ వైవిధ్య దినోత్సవం

ఖమ్మంసంక్షేమవిభాగం, మే22: మొక్కలు నాటటం, వాటిని సంరక్షించటం భావితరాల రక్షణ కోసం మన బాధ్యత అని పర్యావరణ మిత్ర జాతీయ ఆవార్డు గ్రహిత డాక్టర్ కడవెండి వేణుగోపాల్ పిలుపునిచ్చారు. అంతర్జాతీయ జీవ వైవిధ్య దినోత్సవం సందర్భంగా బుధవారం ఖమ్మం అర్బన్ పార్కులో అటవీశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో డాక్టర్ కడవెండి మొక్కలు నాటారు. ప్రతీ వ్యక్తి మొక్కలు నాటుతూ వాటిని సంరక్షించటం అలవాటుగా మార్చుకోవాలని పిలుపునిచ్చారు. ఎఫ్‌ఆర్వో రాధిక, సెక్షన్ ఆఫీసర్ వేణుమాధవ్, అటవీశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

ప్లాస్టిక్ నిషేధానికి కృషి చేయాలి

ఖమ్మంరూరల్: ప్లాస్టిక్ నిషేధానికి ప్రతీ ఒక్కరు కృషి చేయాలని జీవవైవిధ్య జిల్లా కో ఆర్డినేటర్ ఎట్టం శ్రీనివాస్ అన్నారు. మండల పరిధిలోని బారుగూడెంలో జీవ వైవిధ్యా దినోత్సవం కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు శ్రీదేవి, అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

ఈసెట్ ఫలితాల్లో మదర్ థెరిస్సా విద్యార్థులకు రాష్ట్రస్థాయి ర్యాంకులు

సత్తుపల్లిరూరల్, మే22: జేఎన్‌టీయూహెచ్ విడుదల చేసిన ఈసెట్-2024 పరీక్షా ఫలితాల్లో మండలంలోని కొత్తూరులోని మదర్‌థెరిస్సా ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులు రాష్ట్రస్థాయి ర్యాంకులు సాధించినట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ సీ.హరికృష్ణ బుధవారం తెలిపారు. ఎన్.వినయ్‌బాబు (35), ఎం.దీక్షిత్ (54), ఏ.మణికాంత్ (105), బీ.జశ్వంత్ (110), కేఎం.గుణశేఖర్‌రెడ్డి (171), కే.ప్రవీణ్ (173), పీ.వర్థన్ (174), బీ.నాగదుర్గాప్రసాద్ (175), బీ.ఆకాశ్ (205), కే.కళ్యాణ్ (209), పీ.నాగేశ్వరరావు (218), టీ.తిరుపతిరావు (220), బీ.యశ్వంత్‌నాయక్ (333), ఎస్.శ్రీకర్ (371), పీ.సత్యలత (669), సీహెచ్.రాము (700), డీ.ప్రేమ్‌చంద్ (996), కే.నందిని (1280), పీ.ప్రశాంతి (1146), ఎస్‌కే.అస్లమ్ పాషా (1479), బీ.విద్యాసాగర్ (1600), కే.చందన (1700), పీ.సాయిప్రదీప్ (1738), కే.సురేష్ (2000), ఎస్‌కే.షబానా (2359), కే.రేష్మా (2956) ర్యాంకులు సాధించారు. వీరిని కళాశాల ప్రిన్సిపాల్‌తో పాటు సెక్రటరీ, కరస్పాండెంట్ చలసాని సాంబశివరావు, డిప్లమో డీన్ డాక్టర్ ఎంవీ. రామచంద్రరావు, ఇంజనీరింగ్ డీన్ డాక్టర్ జాకీర్‌హుస్సేన్, వివిధ విభాగాల అధిపతులు అభినందించారు.



ర్యాంకులు సాధించిన విద్యార్థులతో యాజమాన్యం

బీజేపీ నుంచి వచ్చిన నేతకు బీఆర్‌ఎస్ టిక్కెట్

ఇండియా కూటమి నాయకులు



ఖమ్మంసంక్షేమవిభాగం, మే22: బీఆర్‌ఎస్ అధికారంలోకి వస్తే మంత్రి పదవి వస్తుందని పల్లా రాజేశ్వరరెడ్డి ఎమ్మెల్సీ పదవీ కాలం ముగియకుండానే రాజీనామా చేసి ఉప ఎన్నికలు తెచ్చారని, స్థానికంగా పోటీ చేసే అభ్యర్థి ముందుకు రాకపోవటంతో బీజేపీ నుంచి బీఆర్‌ఎస్‌లో చేరిన నేతకు ఎమ్మెల్సీ టిక్కెట్ ఇచ్చి పోటీలో పెట్టారని ఇండియా కూటమీ పార్టీల నాయకులు ఎద్దేవా చేశారు. బుధవారం జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో కాంగ్రెస్, సీపీఎం, సీపీఐ, ఆమ్‌ఆద్మీ, టీడీపీ, టీజేఎస్ నాయకులు ఎండీ జావీద్, యర్రా శ్రీకాంత్, తాటి వెంకటేశ్వర్లు మాట్లాడారు. ఖమ్మం, నల్గొండ, వరంగల్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ పోటీ పత్తా లేకుండా పోయిందన్నారు. కాంగ్రెస్ అభ్యర్థి తీన్మార్ మల్లన్న తిరుగులేని మేజార్టీతో గెలుస్తారన్నారు. నాయకులు తిరుమలరావు, విజయ్, రవి పాల్గొన్నారు.

ఎన్నికల విధులపై అవగాహన పెంచుకోవాలి

▸ కలెక్టర్ వీపీ గౌతమ్

ఖమ్మంకలెక్టరేట్,మే22: ఎన్నికల విధులు, బాధ్యతలపై సెక్టార్ అధికారులు పూర్తి అవగాహన కలిగిఉండాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వీపీ గౌతమ్ తెలిపారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఎమ్మెల్సీ ఉప ఎన్నికల కోసం నియమితులైన సెక్టార్ అధికారులకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికలు కేంద్ర ఎన్నికల సంఘం ద్వారా నిర్వహించనున్నట్లు, ఎక్కడా చిన్న పొరపాట్లు లేకుండా, జీరో ఎర్రర్‌తో ప్రక్రియ పూర్తిచేయాలన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికలు, తక్కువ ఓటర్లు కదా అనే భావన రావద్దని తెలిపారు. ఎమ్మెల్సీ ఎన్నికలు బ్యాలెట్ పేపర్‌తో జరుగుతాయన్నారు.సెక్టార్ అధికారులు కనీస మౌళిక సదుపాయాలను పరిశీలించాలన్నారు. డిస్ట్రిబ్యూషన్ కేంద్రం ఎస్ఆర్ అండ్ బిజీఎన్ఆర్ డిగ్రీ కళాశాలల్లో ఏర్పాటుచేయనున్నట్లు తెలిపారు. ఎన్నికల నిర్వహణలో సెక్టార్ అధికారుల పాత్ర కీలకమన్నారు. కార్యక్రమంలో జిల్లా స్థాయి మాస్టర్ శిక్షకులు, జిల్లా ఉపాధికల్పన అధికారి కొండపల్లి. శ్రీరామ్ సెక్టార్ అధికారుల విధులు, బాధ్యతలపై అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ ఉప ఎన్నికల సెక్టార్ అధికారులు పాల్గొన్నారు.

బీజేపీ ప్రభుత్వం రాజ్యాంగ వ్యవస్థలను దుర్వినియోగం చేస్తోంది

▸ వ్యవసాయ కార్మిక సంఘం
జాతీయ కార్యదర్శి వెంకట్

బోనకల్, మే22: బీజేపీ ప్రభుత్వం రాజ్యాంగ వ్యవస్థలను దుర్వినియోగం చేస్తోందని వ్యవసాయ కార్మిక సంఘం జాతీయ కార్యదర్శి బోడ వెంకట్ ఆరోపించారు. స్థానిక వీర తెలంగాణ సాయుధ పోరాట వీరుల భవనంలో బుధవారం జరిగిన ఆ సంఘ జిల్లా కమిటీ సమావేశంలో మాట్లాడారు. బీజేపీ పాలనలో దేశ ఆర్థిక వ్యవస్థ అస్తవ్యస్తంగా మారిందన్నారు. నేడు జరుగుతున్న పార్లమెంటు ఎన్నికల్లో ప్రజలు స్పష్టమైన మార్పు కోరుకుంటున్నారని పేర్కొన్నారు. బీజేపీ మతతత్వ విధానాలు అత్యంత ప్రమాదకరమన్నారు. కార్పోరేట్లకు కొమ్ము కాస్తున్న బీజేపీకి ఈ ఎన్నికల్లో ప్రజలు బుద్ధి చెప్పడానికి సిద్ధంగా ఉన్నారని జోస్యం చెప్పారు. న్యాయ వ్యవస్థలతో పాటు ఎన్నికల సంఘాన్ని కూడా ఆ పార్టీ కనుసన్నలలో నడిచే పరిస్థితి ఉందన్నారు. ప్రజాపోరాటాలతో తమ హక్కులను సాధించుకోవచ్చునని ప్రజలకు సూచించారు. ఈ సమావేశంలో వ్యకాస నాయకులు పొన్నం వెంకటేశ్వరావు, మెరుగు సత్యనారాయణ, ఎర్ర శ్రీనివాసరావు, బంధం వెంకటరాజ్యం, జానకీరాములు, సుధాకర్, బంధం శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

ప్రశ్నించే గొంతుక రాకేష్‌రెడ్డిని గెలిపించాలి

▸ మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య

తల్లాడ, మే22: ఉన్నత విద్యావంతుడు, ప్రశ్నించే గొంతుకైన ఏనుగుల రాకేష్‌రెడ్డిని ఎమ్మెల్సీ ఎన్నికల్లో పట్టభద్రులు గెలిపించాలని మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య కోరారు. బుధవారం తల్లాడ మండలం నారాయణపురం గ్రామంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు రెడ్డెం వీరమోహన్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన విస్తృత సమావేశంలో మాట్లాడారు. బీఆర్‌ఎస్ నాయకులు గ్రామాల్లో పర్యటించి పట్టభద్రులను కలుసుకొని ఎమ్మెల్సీ ఎన్నికల్లో రాకేష్‌రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేయాలని అభ్యర్థించాలని కోరారు. ఈనెల 24వతేదీన సత్తుపల్లిలో జరిగే ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచార సభకు భారీ ఎత్తున పట్టభద్రులను తరలించాలని సూచించారు. తల్లాడ మండలం అన్నారుగూడెం గ్రామానికి చెందిన రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన ఇసన్నపల్లి ప్రసన్న కుమార్ కుటుంబానికి బీఆర్‌ఎస్ తరపున రూ. రెండులక్షల బీమా చెక్కును వారి కుటుంబ సభ్యులకు సండ్ర అందజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ దొడ్డా శ్రీనివాసరావు, సొసైటీ ఛైర్మన్ అయిలూరి ప్రదీప్‌రెడ్డి, దుగ్గిదేవర వెంకట్‌లాల్, కేతినేని చలపతిరావు, శీలం కోటారెడ్డి, వజ్రాల రామిరెడ్డి, శీలం శ్రీనివాసరెడ్డి, ఉదయ్, జీవీఆర్, సంగసాని శ్రీను, పాల్గొన్నారు.

కల్లూరు: ప్రశ్నించే గొంతుక బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీ అభ్యర్థి రాకేష్‌రెడ్డిని గెలిపిచాలని సత్తుపల్లి మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య కోరారు. బుధవారం కల్లూరులో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. రాకేష్‌రెడ్డి విజయం కోసం ప్రతి ఒక్కరు కృషి చేయాలన్నారు. ఈ సమావేశంలో మండల బీఆర్‌ఎస్ అధ్యక్షుడు పాలెపు రామారావు, జడ్పీటీసీ కట్టా అజయ్‌కుమార్, నాయకులు బొప్పన రామారావు, పెడకంటి రామకృష్ణ కాటంనేని వెంకటేశ్వరరావు, దేవరపల్లి భాస్కరరావు. కమ్మి, సిహెచ్ కిరణ్, సయ్యద్ రవూఫ్ తదితరులు పాల్గొన్నారు.

వేంసూరు: ఈనెల 24న సత్తుపల్లిలో జరిగే నియోజకవర్గస్థాయి పట్టభద్రుల ఆత్మీయ సమ్మేళనాన్ని విజయవంతం చేయాలని మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య పిలుపునిచ్చారు. బుధవారం మర్లపాడులో జరిగిన సమావేశంలో మాట్లాడారు. బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీ అభ్యర్థి ఏనుగుల రాకేష్‌రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఈ సమ్మేళనంలో మాజీ మంత్రి తన్నీరు హరీష్‌రావు, పల్లా రాజేశ్వర్‌రెడ్డి, ఎంపీలు నామా నాగేశ్వరరావు, వద్దిరాజు రవిచంద్ర, ఎమ్మెల్సీ తాతా మధుసూదన్, ఆర్‌ఎస్.ప్రవీణ్‌కుమార్ పాల్గొంటారని తెలిపారు. పట్టభద్రులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.



బీమా చెక్కు అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే

శేషగిరిరావు కుటుంబానికి పరామర్శ

తల్లాడ,మే22: మండల పరిధిలోని మిట్టపల్లిలో ఇటీవల అనారోగ్యంతో మృతిచెందిన డీసీఎంఎస్ మాజీ ఛైర్మన్ రాయల వెంకట శేషగిరిరావు కుటుంబాన్ని బుధవారం ఎమ్మెల్సీ తాతా మధుసూదన్, మాజీ ఎమ్మెల్యేలు నల్లమోతు భాస్కర్‌రావు, కొండబాల కోటేశ్వరరావు పరామర్శించారు. ముందుగా శేషగిరిరావు చిత్రపటానికి నివాళులర్పించారు. శేషగిరిరావు భార్య పద్మావతి, కుమారులు రఘునందన్, రేవంత్‌ను పరామర్శించారు.

నేడు విద్యుత్ అంతరాయం

రఘునాథపాలెం, మే22: మంచుకొండ విద్యుత్ ఉపకేంద్రం నిర్వాహణ సందర్భంగా గురువారం ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు విద్యుత్ కోత ఉంటుందని స్థానిక ఇంజనీరింగ్ అధికారి బుధవారం ప్రకటించారు. మల్లేపల్లి, ఫీడర్ మీద ఉన్న మల్లేపల్లి, పెరికలబోడుతండా, జింకలతండా గ్రామ పంచాయతీల్లో విద్యుత్ కోతలు ఉంటాయని తెలిపారు.

తెలంగాణ యోధుడు రాందాస్

ఖమ్మంచర్చికాంపౌండ్, మే22: 1969 తెలంగాణ ఉద్యమానికి ప్రథమంగా తొలివిత్తనం నాటిన తెలంగాణ యోధుడు కొలిశెట్టి రాందాస్ అని తెలంగాణ ఉద్యమకారుల సంక్షేమ సంఘం గౌరవ అధ్యక్షుడు ఎస్.కాంతేశ్వరావు పేర్కొన్నారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాందాస్ ఈనెల 14న మరణించారని, ఆయన తొలిసంతాపం సభను ఈనెల 24న ఖమ్మంలోని మయూరి సెంటర్ వద్ద నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

కుటుంబ సంక్షేమ నిధి పథకం చెక్కు పంపిణీ

ఖమ్మంఖానాపురంహవేలి,మే22: మండల పరిధిలోని రెబ్బవరం ఉన్నత పాఠశాల హిందీ ఉపాధ్యాయుడు మహమూద్ అలీ ఇటీవల మృతి చెందారు. ఈ నేపథ్యంలో కుటుంబ సంక్షేమనిధి పథకం నుంచి ఆరు లక్షల రూపాయల చెక్కును ఆయన భార్యకు బుధవారం పథకం ఛైర్మన్ చావ రవి ఖమ్మంలో అందజేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు దుర్గాభవాని, కోశాధికారి లక్ష్మారెడ్డి, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు నాగమల్లేశ్వరరావు, పారుపల్లి నాగేశ్వరరావు, వల్లంకొండ రాంబాబు, షేక్ రంజాన్, షేక్ ఉద్దండ్, షరీఫ్, షమి, రామకృష్ణ, శ్రీనివాసరెడ్డి, సుధాకర్, నరసింహారావు, సతీష్, మహేష్, స్వామి తదితరులు పాల్గొన్నారు.

ఆ విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలి

ఖమ్మంమామిళ్లగూడెం, మే22: విద్యను వ్యాపారంగా చేస్తూ ఇష్టారాజ్యంగా ఫీజులను వసూలు చేస్తున్న విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలని టీఎన్ఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు కే.పృథ్వీ డిమాండ్ చేశారు. బుధవారం టీడీపీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. ఫీజుల వసూళ్లపై కమిటీని వేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో బిక్కసాని మురళి, వల్లభనేని సాయి, దమ్మాలపాటి సాయి,లహరిన్, శ్రీకుమార్ పాల్గొన్నారు.

ప్రైవేటు స్కూళ్లలో ఫీజులను నియంత్రించాలి

వైరా,మే22: ప్రైవేటు పాఠశాలల్లో ఫీజులను నియంత్రించాలని ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో బుధవారం వైరా తహసీల్దార్ కేవీ.శ్రీనివాసరావుకు వినతిపత్రం అందజేశారు. అనుమతులు లేకుండా అడ్మిషన్లు చేసే పాఠశాలలపై కూడా చర్యలు తీసుకోవాలని కోరారు. నాయకులు పుప్పాళ్ల నాగరాజు, కోట ప్రేమ్‌కుమార్, వేమూరి అజయ్, హేమంత్, జస్వంత్, చరణ్, గణేష్, మనోహర్, ఉపేందర్, గోపి పాల్గొన్నారు.

ఆహార కల్తీలను నిరోధించాలి

ఖమ్మంసంక్షేమవిభాగం,మే22: ఆహార కల్తీని నివారించాలంటూ మాస్‌లైన్ పార్టీ ఆధ్వర్యంలో బుధవారం జిల్లా అదనపు కలెక్టర్ సత్యప్రసాద్‌ను కలిసి వినతిపత్రం అందించారు. కిరాణ షాపులు, పాల ఉత్పత్తులు, హోటల్స్, బేకరీలు, రెస్టారెంట్లు కనీస పరిశుభ్రత పాటించటం లేదని ఫిర్యాదు చేశారు. నాణ్యత లేని మాంసం, మసాలాలు, దినుసులు అమ్మకాలు చేస్తున్నారని ఆరోపించారు.

నిరుద్యోగులకు భృతి కల్పించాలి

ఖమ్మంసంక్షేమవిభాగం, మే22: పదేళ్లుగా బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో నిరుద్యోగులు దగాకు గురయాయరని, తెలంగాణ రాష్ట్రంలో తొలిసారిగా అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ నిరుద్యోగుల ఆర్థిక ఇబ్బందులపై ఆలోచించాలని పీవైఎల్ జిల్లా అధ్యక్షులు ప్రేమ్‌సింగ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం పత్రికా ప్రకటన విడుదల చేశారు. నిరుద్యోగభృతి కల్పించాలని కోరారు.

పాలిసెట్ నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి

మధిరటౌన్,మే22: మధిరలో పాలిసెట్ పరీక్ష నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి చేశామని జిల్లా పాలిసెట్ ఎంట్రెన్స్ కో ఆర్డీనేటర్ మల్యాల రామస్వామి, మధిర ఎంఈవో ప్రభాకర్ తెలిపారు. బుధవారం మధిరలోని టీవీఎం పాఠశాలలో ఇన్విజిలేటర్లకు ఎంట్రెన్స్ నిర్వహణపై పలు సూచనలు చేశారు. మధిరలో టీవీఎం పాఠశాలలో 220 మంది, సీపీఎస్ పాఠశాలలో 190 మంది పరీక్ష రాస్తున్నట్లు చెప్పారు. ఈనెల 24న ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు జరుగుతుందన్నారు. విద్యార్థులు గంట ముందే పరీక్ష కేంద్రానికి రావాలని సూచించారు. స్మార్ట్‌వాచ్ లు, సెల్‌ఫోన్లు ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలు అనుమతించరని చెప్పారు. కేవలం హెచ్‌బీ పెన్సిల్ మాత్రమే అనుమతిస్తారని చెప్పారు. తాగునీరు, ప్రథమ చికిత్స కేంద్రం ఏర్పాటు చేశామని చెప్పారు.

జాతీయస్థాయికి సదాశివునిపాలెం విద్యార్థులు

సత్తుపల్లి, మే22: ఎన్ఎంఎంఎస్ 2024 పరీక్షలో మండల పరిధిలోని సదాశివునిపాలెం జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలోని ఇద్దరు విద్యార్థినులు జాతీయ స్థాయికి ఎంపికయ్యారు. 8వ తరగతి చదువుతున్న గుదే చైత్ర, గుదే లాస్యలను హెచ్‌ఎం కృష్ణకుమారి అభినందించారు.

